ప్రతిపక్షం
www.prathipaksham.in

ఆర్సీబీ ఖాతాలో మూడో విజయం..! 10

శనివారం 17.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 297 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కడతాం

ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం.. పాలమూరు, ఆదిలాబాద్‌కు సమానంగా నిధులు

- ఎర్రబస్సు తిరగని చోట ఏయిర్‌బస్‌తీసుకొస్తాం
- బాసరలో యూనివర్సిటీ ఏర్పాటు
- పదివేల ఎకరాల్లో పారిశ్రామిక కేంద్రం
- సదర్మాట్ బ్యారేజీ ప్రారంభం
- ఎన్నికలప్పుడే రాజకీయాలు
- ఎన్నికలయ్యాక అభివృద్ధే లక్ష్యం
- నిధుల కోసం ఎవరినైనా కలుస్తా
- ప్రధాని మోడీని కలిస్తే తప్పేంటీ?
- బీఆర్ఎస్ పాలనలో అదిలాబాద్ అభివృద్ధి జరగలేదు
- ఉమ్మడి అదిలాబాద్ ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి వరాలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే, ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందేనని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌పోర్టు తీసుకొస్తామని, ఎర్రబస్సురాని చోటుకు ఎయిర్‌బస్‌ను తీసుకొస్తామని అన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దామని చెప్పారు. ఎయిర్‌పోర్టు కోసం 10 వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలని తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యమన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి మోదీని కలుస్తున్నామని, రాష్ట్ర బీజేపీ నేతలు కూడా రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలని కోరారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. దీంతో పాటు ఉమ్మడి జిల్లా ప్రజలకు వరాల జల్లు కురిపించారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారి నిర్మల్‌కే వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే ముఖ్యమంత్రి అయినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో మొదటి బహిరంగసభ పెట్టామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అని జల్, జంగల్, జమీన్ అంటూ కుమంరంభీం కొట్లాడారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మల్లోని ఆర్ మినీ

...:: మిగతా 2లో

ఆ ముగ్గురిపై విచారణ పూర్తి చేయండి

స్పీకర్‌కు సుప్రీం మరో నాలుగు వారాల గడువు

- స్పీకర్ తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టుకు నివేదిక
- సుప్రీం ఆదేశాల అమలులో స్పీకర్ విఫలమయ్యారు: బీఆర్ఎస్ లాయర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 16 : పార్టీ ఫిరాయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్‌కు సుప్రీంకోర్టు నాలుగు వారాలు గడువు ఇచ్చింది. ఈ నాలుగు వారాల్లో ముగ్గురు ఎమ్మెల్యేల విచారణ పూర్తిచేసి నిర్ణయం వెలువరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ సత్వరమే నిర్ణయం తీసుకునే విధంగా ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఈ విచారణలో సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చి, కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో స్పీకర్ పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్లు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద్, కేటీఆర్ తరపు న్యాయవాదులు వివరించారు. విచారించిన ధర్మాసనం స్పీకర్ కు 4 వారాల సమయమిస్తూ వాయిదా వేసింది.

...:: మిగతా 2లో

పోచారం, యాదయ్యలకు స్పీకర్ క్లీన్‌చీట్



- వారు పార్టీ మారారనేందుకు ఆధారాలు లేవు
- గతంలోనే ఐదుగురు ఎమ్మెల్యేలపై తీర్పు

...:: 2లో

20న కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటన

భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ఈనెల 19వ తేదీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. 20వ తేదీన పార్టీ కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. బీజేపీ జాతీయ రిటర్నింగ్ ఆఫీసర్ కే లక్ష్మణ్ షెడ్యూల్‌ను రిలీజ్ చేశారు.

9

ముంబయిలో ముగిసిన ఠాక్రేల హవా..

ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేనకు ముంబయి మహానగరం కీలకమైనది. దేశ ఆర్థిక రాజధానిపై వారి హవానే కొనసాగింది. తాజా ఎన్నికల్లో ఉద్ధవ్‌కు రాజ్ అండగా నిలిచినా చతికిలపడింది. భాజపా-శివసేన కూటమి ఘనవిజయం సాధించింది.

9



పుతిన్, నెతన్యాహు కీలక చర్చలు!

రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్ కాల్‌లో మాట్లాడుకున్నారు. ఇరాన్ సంఘర్షణ నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై వారు చర్చించుకున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి.

9

'స్టార్టప్ ఇండియా' విప్లవంగా మారింది

- రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్‌లో అగ్రగామిగా భారత్
- రిస్క్ తీసుకొని వ్యాపారం పెట్టడం ఇప్పుడొక ఫ్యాషన్
- 'నేషనల్ స్టార్టప్ డే' కార్యక్రమంలో ప్రధాని మోదీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

న్యూఢిల్లీ, జనవరి 16: రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభాగాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ అన్నారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్‌లు పురోగమిస్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' సందర్భంగా శుక్రవారం దిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 2014లో దేశంలో 4 యూనికార్న్‌లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 125కు చేరిందన్నారు. పదేళ్ల క్రితం 500 స్టార్టప్‌లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 2 లక్షలు దాటిందన్నారు. ఒక్క 2025 సంవత్సరంలోనే 44వేల స్టార్టప్‌లు రిజిస్టర్ అయ్యాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ భారత్‌లోనే ఉందన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' వేడుకకు హాజరైన స్టార్టప్‌ల వ్యవస్థాపకులను చూస్తుంటే, తనకు నవ్య భారత్, వికసిత భారత్

...:: మిగతా 2లో



కుటుంబం, పార్టీ కోసమే వారు పని చేశారు

- ఉద్యోగాల భర్తీ పై బీఆర్ఎస్ ఆలోచన చేయలేదు
- నిరుద్యోగ యువత నడుం బిగించారు కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది
- విద్యార్థులు ప్రాణత్యాగాలు చేసి తెలంగాణను సాధించారు
- 14 యేళ్ల పాటు గ్రూప్ వన్ నియామకాలు చేపట్టలేకపోయారు
- ఇంత కంటే దారుణం, ఘోరం ఎక్కడైనా ఉంటుందా?
- కొలువుల పండుగ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- ఎంపికైన గ్రూప్ -III అభ్యర్థులకు నియామక పత్రాలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 16 : పదేళ్లలో రెండు సార్లు సీఎం అయిన వ్యక్తులు రాజకీయ, కుటుంబ, పార్టీ ప్రయోజనాల కోసమే పని చేశారని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పైన ఆలోచన చేయలేదని, కుటుంబం మొదటి ప్రాధాన్యత, పార్టీ రెండో ప్రాధాన్యత, రాజకీయాలు మూడో ప్రాధాన్యతగా గత పాలకులు ఆలోచించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ యువత గురించి ఆలోచించలేదని, వాళ్ల ఉద్యోగాలు తొలగిస్తేనే మాకు ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగ యువత నడుం బిగించారు కాబట్టే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. శుక్రవారం శిల్పాకళా వేదికలో కొలువుల పండుగ కార్యక్రమంలో

...:: మిగతా 2లో

గాదె ఇన్నయ్యకు బెయిల్

- 48 గంటల తాత్కాలిక బెయిల్‌ఇచ్చిన కోర్టు
- ఇన్నయ్య తల్లి థెరిసమ్మ (93) మృతి
- అంత్యక్రియల్లో పాల్గొననున్న ఇన్నయ్య

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 16 : యూపీఏ చట్టం కింద ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం

...:: మిగతా 2లో

రెండో దశ మెట్రో వివరాలు పంపండి

- మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలి
- లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్రం చర్యలు
- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 16: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను

...:: మిగతా 2లో

అడ్డుపడితే టారిఫ్‌ల మోత

గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడానికి సహకరించని దేశాలపై టారిఫ్‌లు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం హెచ్చరించారు.

9

పోచారం, యాదయ్యలకు స్పీకర్ క్లీన్‌చీట్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 16 : ఇవాళ సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ వేసిన పిటిషన్ విచారణకు వస్తున్న నేపథ్యంలో స్పీకర్‌గురువారం స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య బీఆర్ఎస్ లోనే ఉన్నట్లు తెలంగాణ స్పీకర్‌ప్రసాద్‌కుమార్ క్లీన్‌చీట్ ఇచ్చారు. వారు పార్టీ మారారనేందుకు ఆధారాలు లేవన్నారు. బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన పది మందిలో గతంలోనే ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్‌క్లీన్‌చిట్ ఇచ్చేశారు. వీరు కాకుండా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై వచ్చిన ఫిర్యాదులపై స్పీకర్ విచారణ జరపాల్సి ఉంది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పై దాఖలైన అనర్హత పిటిషన్‌విచారణ పూర్తి అయింది. కానీ తీర్పును ఇంకా వెల్లడించలేదు. స్పీకర్ తీర్పును రిజర్వులో ఉంచారు.

ఎనిమిది మందిపై విచారణ పూర్తి..

రెండు దశల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిరాయింపు ఫిర్యాదులను విచారించిన సభాపతి తీర్పు వెల్లడించారు. తమ పార్టీకి చెందిన 10 మంది శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు బీఆర్ఎస్‌ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీంతో సుప్రీంకోర్టు విచారించగా పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు ఒకసారి 3 నెలలు, మరోసారి 4 వారాల గడువు ఇచ్చింది. డిసెంబర్ 19వ తేదీతో రెండోవిడత గడువు ముగిసింది. ఈ మేరకు న్యాయనిపుణులు, అడ్వొకేట్ జనరల్‌తో చర్చించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తమ వివరణలను సభాపతికి సమర్పించారు. దీంతో వారు అఫిడవిట్ దాఖలు చేశారు. మరోవైపు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ ఆధారాలను స్పీకర్‌కు సమర్పించారు.

రెండో దశ మెట్రో వివరాలు పంపండి

మొదటిపేజీ తరువాయి

ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. తాను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి మెట్రో రెండో దశ నిర్మాణం గురించి చర్చించానని కిషన్‌రెడ్డి వివరించారు.

లావాదేవీలు పూర్తి చేయాలి..

ముందుగా మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండోదశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి.

అధికారుల పేర్లను పంపించాలి..

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్రప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదే విధంగా, వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్రప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

గాదె ఇన్నయ్యకు బెయిల్

మొదటిపేజీ తరువాయి

ఆయనకు షరతులతో కూడిన 48 గంటల తాత్కాలిక బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. గాదె ఇన్నయ్య తల్లి థెరిసమ్మ (93) గురువారం రాత్రి మరణించారు. ఈ నేపథ్యంలో ఆయనకు కోర్టు ఈ బెయిల్ మంజూరు చేసింది. శనివారం జనగామ జిల్లాలోని జాఫర్‌గఢ్ మండలం సాగరంలో ఆయన తల్లి అంత్యక్రియలు జరగనున్నాయి. అందులో గాదె ఇన్నయ్య పాల్గొనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత కాటా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ మరణించారు. ఆయన అంత్యక్రియలకు మావోయిస్టు మాజీ నేత గాదె ఇన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు అనుకూలంగా ఆయన వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజలను.. ప్రేరేపించారనే ఆరోపణలుపై ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. ఆ క్రమంలో డిసెంబర్ 21న ఇన్నయ్యను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడే ఉన్నారు. మంగళవారం జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో గాదె ఇన్నయ్య నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం విదితమే.

ఖమ్మం బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ
- కోటి మందికి చేరేలా శతాబ్ది ఉత్సవాల ప్రచారం
- బస్సులు, వాహనాలు, రైళ్ల ఏర్పాట్లు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

ప్రతిపక్షం, విజయవాడ, జనవరి 16 : ఖమ్మంలో ఈనెల 18వ తేదీన జరగనున్న సీపీఐ శతాబ్ది వార్షికోత్సవ భారీ బహిరంగ సభ, ప్రదర్శన ఒక చారిత్రాత్మకంగా నిలవనుందని, ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు ఉత్సాహంగా తరలిరావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం జూమ్ ద్వారా జరిగింది. విజయవాడ చంద్రం బిల్డింగ్స్ నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ జల్లి విల్సన్, వివిధ జిల్లాల నుంచి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ, ఖమ్మం బహిరంగ సభకు ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. రాయలసీమ వంటి దూర ప్రాంతాల నుంచి వచ్చేందుకు రైళ్లు ఏర్పాట్లు చేసిన అక్కడి జిల్లా నాయకత్వం పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మన పార్టీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం ఒక అదృష్టమని, మళ్లీ అలాంటి రోజు తిరిగి రాబోదన్నారు. ఈ జీవితాంతం గుర్తుండే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గతంలో ఏపీ కేంద్రంగా జరిగిన పార్టీ జాతీయ సభలకు తెలంగాణ రాష్ట్రం నుంచి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఖమ్మం బహిరంగ సభ ప్రాంగణానికి, ప్రదర్శనకు సకాలంలో ప్రజలు చేరుకోవాలని కోరారు. రైళ్ల ద్వారా వచ్చే ఆయా జిల్లాల నాయకులంతా ఖమ్మం జిల్లాలోని నయాబజార్ కళాశాల, శ్రీశ్రీ విగ్రహం, పెవిలియన్ గ్రౌండ్ (జనసేవాదళ్ వలంటీర్లు) నుంచి జరగబోయే ప్రదర్శనలకు మన నాయకత్వం బాధ్యత వహించాలని సూచించారు. ఖమ్మంలో 18న జరిగే ప్రదర్శన, బహిరంగ సభ విజయవంతానికి సమన్వయంగా కృషి చేయాలని కోరారు. బహిరంగ సభ అనంతరం, 19న పార్టీ జాతీయ కౌన్సిల్ జరుగుతుందన్నారు. 20న జరిగే పార్టీ జాతీయ సెమినార్‌లోను మన రాష్ట్ర నాయకత్వం, జిల్లా కార్యదర్శులు పాల్గొనాలని కోరారు. తప్పకుండా పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో ఖమ్మం సభ విజయవంతం అయ్యేంత వరకు శ్రమించాలని కోరారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ, తొలుత పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మంలో జరగనున్న భారీ బహిరంగ సభకు, ప్రదర్శనకు ఒక నూతనుత్తేజంతో ఇంటికొకరు చొప్పున పార్టీ శ్రేణులు హాజరు తరలిరావాలన్నారు. వందేళ్ల చరిత్ర గలిగిన కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి మరింత స్ఫూర్తినిచ్చేలా రాష్ట్రం నలుమూలల నుంచి కదంతొక్కాలని కోరారు. మన పార్టీ శతాబ్ది ఉత్సవాల సభకు రైళ్లు, బస్సులు, వాహనాల ద్వారా తరలివెళ్లూనే, మరోవైపు సోషల్ మీడియా (ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్) వేదికగా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సభకు వచ్చే పార్టీ శ్రేణుల కోసం భోజన, అల్పాహార ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీశ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, జల్లి విల్సన్, ఆయా జిల్లాల నుంచి రాష్ట్రకార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

“

గత ప్రభుత్వంలో ఎప్పుడైనా రేషన్ బియ్యం తిన్నారా.? మేము రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ఇస్తున్నాం. గతంలో రేషన్ బియ్యం ఎవరూ తినేవారు కాదు. ఇప్పుడు పిల్లలకు కూడా పెడుతున్నారు. సన్నవడ్లు పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతులతో పాటు 50 లక్షల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.

- నిర్మల్ సభలో సీఎం రేవంత్ రెడ్డి

జైపాల్ రెడ్డికి సీఎం నివాళి

దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 84 వ జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్ లోని ఆయన సమాధి స్ఫూర్తి స్థల్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హాజరైన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణా రావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలు, జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. - ప్రతిపక్షం, హైదరాబాద్

తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కడతాం

మొదటిపేజీ తరువాయి

స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. పాలమూరు జిల్లాతో సమానంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు ఇచ్చి, పారిశ్రామికంగా ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ అనుకుంటే పదేళ్ల పాలనలో ఆదిలాబాద్ అభివృద్ధి చెందేదని రేవంత్ రెడ్డి అన్నారు. ఎందుకో ఏమోగాని అభివృద్ధి ఆయన చేయలేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ లేదని వెంటనే వర్సిటీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బాసర ఐఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తామన్న సీఎం నిర్మల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి ఎవరినైనా కలుస్తా...తప్పేంటీ?

అభివృద్ధి, నిధుల కోసం ఎవరినైనా కలవడానికి తాను సంకోచించనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధానికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చామని, అడగాల్సిన ప్రాజెక్టులు అడిగామన్నారు. పదేళ్లపాటు కేంద్రప్రభుత్వాన్ని గత ప్రభుత్వం ఏమి అడగలేదని, అలా చేస్తే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. గత పాలకులు చేసిన అప్పులు ఉరితాడై ప్రభుత్వం ఊపిరి పోతున్నదని విమర్శించారు. ప్రధాని మోదీని పదే పదే కలుస్తున్నానని కొంతమంది విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఇచ్చేది కేంద్రం, ప్రధాని కాదా? అని ప్రశ్నించారు. ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి? అని మండిపడ్డారు. నాగోబా జాతరకు రూ.22 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని, సమ్మక్కసారలమ్మ జాతరకు రూ.300 కోట్ల కేటాయించి పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు.

పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామం..

ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందని, పెట్టుబడుల కోసం నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇస్తే సలహాలు ఇవ్వాలి లేకుంటే ఫామ్‌హౌస్‌లో కూర్చోవాలని పరోక్షంగా కేసీఆర్ , ఆ పార్టీ నేతలపై విమర్శలు గుప్పించారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ధ్వజమెత్తారు. రూ. వేల కోట్లు దోపిడీ చేశారని మండిపడ్డారు.

ప్రజా ప్రభుత్వంతో పని చేయండి..

సమస్యలను ఒక్కక్కొట్టిగా పరిష్కరిస్తున్నామని, మీరందరూ తమ వెంట ఉంటే తెలంగాణను దేశంలోనే నంబర్ 1 చేస్తామని రేవంత్ రెడ్డి కోరారు. ప్రజాప్రభుత్వంతో కలిసి పనిచేసేవారిని గెలిపిస్తే మన సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని మీడియాలో వార్తలు వస్తున్నాయని, ఆశావహులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. అంతకు ముందు ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించారు. భోరాజ్ మండలం హతిఘాట్‌లో చనాకాకొరాటా పంప్‌హౌస్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

సదర్మాట్ బ్యారేజీ ప్రారంభం...

నిర్మల్ జిల్లా మామడ మండలం పొనకల్ చేరుకున్న సీఎం గోదావరి నదిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని ప్రారంభించారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ కుమార్ జాదవ్, వెడ్మ బొజ్జు, సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు ఉన్నారు.

బీఆర్ఎస్ తప్పిదాల వల్లే: ఉత్తమ్

బీఆర్ఎస్ పార్టీ చేసిన తప్పిదాల వల్లే గోదావరి నీళ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని నీటిపారుదల శాఖ మంత్రి విమర్శించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పూర్తి చేయకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ప్రస్తుతం దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఎక్కువ వరి పంట పండించిందని పేర్కొన్నారు. మిగిలిన సాగునీటి ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే కోరినట్లు ప్యాకేజీ 27 భూ సేకరణ కోసం రూ.97 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. లక్ష ఎకరాలను సాగులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే ఏపీ ప్రభుత్వం పోలవరంనల్లమల సాగర్ ప్రాజెక్టు గురించి మాట్లాడుతుందని దానికి తాము పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఆ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో కూడా పోరాడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, , ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

‘స్టార్టప్ ఇండియా’ విప్లవంగా మారింది

మొదటిపేజీ తరువాయి

కనిపిస్తోందని మోదీ వ్యాఖ్యానించారు. “స్టార్టప్ ఇండియా మిషన్ వేగాన్ని పుంజుకుంటోంది. అదొక విప్లవంగా మారింది. ఇక కంఫర్ట్ జోన్‌లో జీవించే ఉద్దేశం భారతీయ యువతకు లేనే లేదు. నూతన లక్ష్యాలతో సరికొత్త ఎత్తులకు ఎదగాలని వారు కోరుకుంటున్నారు. అసలైన సమస్యల పరిష్కారంపై భారతీయ యువత, ఎంట్రప్రెన్యూర్‌లు ఫోకస్ పెట్టారు. టైర్ 2, టైర్ 3 నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల యువత కూడా సొంతంగా వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. స్టార్టప్ ఇండియా కార్యక్రమం వల్ల భారత్‌లో ఏర్పడిన ఎన్నో యూనికార్న్‌లు స్టాక్ మార్కెట్‌లో ఐపీఓలకు వస్తున్నాయి. 45 శాతం భారతీయ స్టార్టప్‌లలో సగటున ఒక మహిళా డైరెక్టర్ లేదా పార్ట్‌నర్ ఉన్నారు. మహిళల సారథ్యంలో ఏర్పాటయ్యే స్టార్టప్‌లకు ఫండింగ్‌ను అందించే విషయంలో ప్రపంచంలో రెండో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ ఎదిగింది. స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించక ముందు నేను ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఓ కార్యక్రమానికి హాజరయ్యాను. అందులో ఓ మహిళా స్టార్టప్ ఆవేదనను విన్నాను. ఉద్యోగాన్ని వదిలేసి స్టార్టప్‌ను పెడతాను అన్నందుకు తన తల్లి తీవ్ర భయాందోళనకు గురైందని ఆ మహిళ గోడును వెళ్లబోసుకుంది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది’’ అని ప్రధాని మోదీ తెలిపారు.

కుటుంబం, పార్టీ కోసమే వారు పని చేశారు

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రూప్ III లో ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు 25 ప్రభుత్వ శాఖల్లో నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పుట్టిన బిడ్డ ప్రయోజకుడు అయితే తల్లిదండ్రుల ఆనందం అంతా ఇంతా కాదని, కూలీ పని చేసి మరీ తల్లిదండ్రులు చదవించి పోటీ పరీక్షలకు తయారు చేశారని అన్నారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల్లో విద్యార్థులు ఉద్యమకారులయ్యారని, విద్యార్థులు అవసరమైన సందర్భంలో ప్రాణత్యాగాలు చేసి తెలంగాణను సాధించారని తెలిపారు. టీజీపీఎస్సీలో దారుణ పరిస్థితులు అందరికి తెలుసని, 14 యేళ్ల పాటు గ్రూప్ వన్ నియామకాలు చేపట్టలేకపోయారని అన్నారు. ఇంత కంటే దారుణం, ఘోరం ఎక్కడైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. 563 గ్రూప్ వన్ ఉద్యోగాల కోసం 5 లక్షల మంది అప్లికేషన్లు పెట్టుకున్నారని, 731 గ్రూప్ 2 ఉద్యోగాల కోసం కూడా 5 లక్షల మంది అప్లై చేశారని అన్నారు. గత ప్రభుత్వం పరీక్షలను సరిగా నిర్వహించలేదని, ప్రశ్నాపత్రాలను పల్లీ బఠానీల్లా అమ్మితే వారికి చీమకుట్టినట్లైనా లేదని అన్నారు. టీజీపీఎస్సీ ని సమూలంగా ప్రక్షాళన చేశామని, యూపీఎస్సీని స్వయంగా పరిశీలించి టీజీపీఎస్సీ ని ఏర్పాటు చేశామని, ఆర్ఎంపీ డాక్టర్, డిప్యూటీ ఎమ్మార్వో, రిటైర్డ్ టీచర్ ను టీజీపీఎస్సీ సభ్యులుగా గత ప్రభుత్వం నియమించిందని అన్నారు. తెలంగాణ నిరుద్యోగుల పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తెలంగాణ పట్ల చిత్తశుద్ధి ఉన్నవాళ్లనే టీజీపీఎస్సీ సభ్యులుగా నియమించామని తెలిపారు. ప్రభుత్వ టీచర్లు, గ్రూప్ 1,2,3 వంటి ఉద్యోగాలను ఒక బాధ్యతతో ఎలాంటి తప్పులు లేకుండా భర్తీ చేశామని, నియామక పత్రాలు ఇవ్వొద్దని కుట్రలు చేసినా కోర్టుల ముందు కొట్లాడి భర్తీ చేశామని అన్నారు. రెండేళ్లలో దాదాపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఎల్బీ స్టేడియం, శిల్పారామం, సాగునీటి పారుదల శాఖ కార్యాలయం, అంబేద్కర్ విగ్రహం సాక్షిగా నియామక పత్రాలను అందజేశాం, భవిష్యత్తు తరాలకు మీ ఉద్యోగాలు దిక్సూచిగా మారుతుంది అని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒక భావోద్వేగం, తెలంగాణ రాష్ట్ర పునర్ నిర్మాణంలో మీమ్మల్ని భాగస్వాములు చేస్తోందని, 25 ప్రభుత్వ శాఖల్లో 1370 ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం, ఉద్యోగ నియామకాలతో మమ్మల్నీ కలిసి మీ కళ్లలో ఆనందం చూడాలనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. మాజీ ప్రధాని నెహ్రూ విద్య, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత ఇచ్చారు. దేశంలో హరిత విప్లవాన్ని తీసుకువచ్చి అహార భద్రత కల్పించింది మాజీ ప్రధాని నెహ్రూ, విద్య అందరికి అందుబాటులో ఉన్నప్పటికి నాణ్యమైన విద్య ప్రజలకు అందడం లేదు, 16 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్నారు, 11 వేల ప్రైవేట్ స్కూల్స్ లో 33 లక్షల విద్యార్థులు చదువుతున్నారని, ప్రభుత్వ పాఠశాలపైన ఎందుకు విశ్వాసం తగ్గుతుందో ఆలోచించాలని అన్నారు. పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తే ప్రపంచంతో పోటీ పడగలమనే విశ్వాసం నాకుంది. భారతదేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రం గా తెలంగాణ నిలబడింది. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరిని పండించి దేశానికి ఆదర్శంగా నిలబడ్డాం అని ఆయన చెప్పారు. క్వాలిటీ ఎడ్యుకేషన్, క్వాలిటీ ఫుడ్, స్కిల్ పైన దృష్టి పెడుతున్నాం , స్కిల్ లేకపోవడంతో అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడలేకపోతున్నామని, విద్యలో స్కిల్ చాలా ముఖ్యమైనదని స్కిల్ డెవలప్మెంట్ కోసం పనిచేయాల్సి ఉందన్నారు. నాణ్యమైన విద్యను అందించే అవకాశం ప్రభుత్వం దగ్గర ఉంది. విద్య ఒక్కటే జీవితాల్లో మార్పు, వెలుగులు తీసుకు వస్తుంది. ప్రభుత్వానికి వారధులు, సారధులు ప్రభుత్వ ఉద్యోగులేనని అన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా తెలంగాణ ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. పేదల మోహంలో తల్లిదండ్రులను చూసుకుని ప్రభుత్వ ఉద్యోగులు సేవలు లక్ష్యంగా అందించాలని, తల్లిదండ్రులను గౌరవంగా చూసుకొని ఉద్యోగుల జీతంలో 10 నుంచి 15 శాతం కోత విధించి తల్లిదండ్రులకు అందజేస్తామని, తల్లిదండ్రులను సరిగా చూసుకోని వాళ్లు మానవ జన్మలో ఉండొద్దు. తల్లిదండ్రులను బాగా చూసుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డి, హర్కర్ వేణుగోపాల్ రావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ, రాజ్య సభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ, కాలే యాదయ్య ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి

- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, పర్యవేక్షణతో నిధులు
- వేములవాడ లో రాజన్న ఆలయ విస్తరణ, మేడారంలో సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం
- భీమేశ్వర ఆలయంలో పూజలు, కోడె మొక్కు చెల్లింపు
- పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ప్రతిపక్షం, వేములవాడ, జనవరి 16: భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేయిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క ఆలయానికి రాగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే పుష్పగుచ్చం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకొని, భీమేశ్వర స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రి మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి స్వామి వారి ప్రసాదం అందజేసి, వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అత్యంత భక్తుల రద్దీ ఉండే ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వివరించారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల విషయమై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, సీఎం, మంత్రులు హాజరై ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రూ. 150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన వసతులు, దర్శన భాగ్యం త్వరలోనే అందుబాటులోకి రానున్నదని తెలిపారు.అలాగే మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఆదివాసి పూజారులు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా గద్దెల పునర్నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు వందల ఏండ్ల పాటు నిలిచిపోయేలా.. రెండు వందల కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేసి.. రానున్న తరాలకు చరిత్ర తెలిసేలా పనులు సీఎం రేవంత్ రెడ్డి చేయించారని వివరించారు. ఈ నెల 18వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మేడారం రానున్నారని, అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 19వ తేదీన మేడారం జాతర పనులను సీఎం, మంత్రులు ప్రారంభిస్తారని వెల్లడించారు. మేడారం జాతరకు ముందు రాజన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అందులో భాగంగానే తాను ఇక్కడికి వచ్చానని వివరించారు. మేడారం జాతరకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు స్వాగతం పలికామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తల్లులను దర్శించుకోవాలని కోరారు.

రూ.150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ..

రూ. 150 కోట్ల నిధులతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వంలోని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న భక్తులకు వేగంగా స్వామి వారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించేలా పనులు సాగుతున్నాయని వివరించారు. ఈ ప్రాంతంపై ప్రత్యేక ఆసక్తి, చొరవతోనే సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మేడారంలో కూడా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. మేడారంలో మొక్కులు చెల్లించుకునే ముందు వేములవాడ కు రావడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు.

ప్రజల కోసం పోరాడిన జైపాల్‌రెడ్డి

- టీపీసీసీ చీఫ్‌మహేశ్‌కుమార్‌గౌడ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 16: జైపాల్ రెడ్డి దేశ రాజకీయాల్లో అపూర్వమైన వ్యక్తిత్వం గల వ్యక్తి, సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహానాయకుడని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. దేశ రాజకీయాల్లో విలువలు, సిద్ధాంతాలు, ప్రజా సేవకు ప్రతీకగా నిలిచిన ఉత్తమ పార్లమెంటేరియన్ దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా ఆయనకు మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళులు అర్పించారు. విద్య, పర్యావరణం, భూసంస్కరణలు, పరిశ్రమలు, సమాచార సాంకేతికత వంటి కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తూ దేశ అభివృద్ధిలో విశేష పాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రత్యేకించి తెలంగాణ ప్రజల హక్కుల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర స్థాయిలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో జైపాల్ రెడ్డి ఆలోచనలు, విధానాలు మార్గదర్శకమని, యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉందని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ఆచరణలో చూపిన నాయకుడిగా ఆయన సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. జైపాల్ రెడ్డి గారి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అవుతుందని, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 16: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025-26 సీజన్‌లో మద్దతు ధర ద్వారా కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో మద్దతు ధరతో కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

క్వింటాల్‌కు రూ. 8,000 మద్దతు ధర

వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల కందుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 మద్దతు ధర నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారు.

దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు

నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకురావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

హాట్‌ఎయిర్ బెలూన్‌ఎక్కేద్దాం

- ఈ నెల 18 వరకు ప్రదర్శన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 16 : అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే విధంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా హాట్ ఎయిర్ బెలూన్ షోను ఏర్పాటు చేసినట్లు జూపల్లి పేర్కొన్నారు. హైదరాబాద్ గోల్కొండలోని గోల్ఫ్ కోర్టు వద్ద హాట్ ఎయిర్ బెలూన్ షోను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా హాట్ ఎయిర్ బెలూన్ ఎక్కిన మంత్రి జూపల్లి కృష్ణారావు గోల్ఫ్ కోర్టు నుంచి గండిపేట లేక్ వరకు 10 కిలోమీటర్ల మేర ప్రయాణించారు. నేటి నుంచి 3 రోజుల పాటు ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. హాట్ ఎయిర్ బెలూన్‌లో ప్రయాణించి నగర అందాలను ఆకాశం నుంచి వీక్షించే అవకాశం ఉంది. 18కి పైగా హాట్ ఎయిర్ బెలూన్లు అందుబాటులో ఉంచారు.

ప్రాజెక్టులు కట్టింది బీఆర్ఎస్.. లబ్ధి పొందడం కాంగ్రెస్ పని

- రెండేళ్ల పాలనలో చేసిందేమీ లేదు
- మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 16: కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులకు కాంగ్రెస్ స్టిక్కర్లు అంటించి, రిబ్బన్ కటింగ్‌లు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. వంట వండి వడ్డనకు సిద్ధం చేస్తే గంట పట్టుకుని ఫోటోలకు పోజులివ్వడం రేవంత్ రెడ్డికే చెల్లిందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదని, చెప్పుకునేందుకు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా లేదని హరీశ్ రావు ఆరోపించారు. కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అన్నట్లు సీఎం పదవి రేవంత్ రెడ్డికి కలిసొచ్చిందని, కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు, ఉద్యోగ నియామక పత్రాలు రెడీమేడ్‌గా చేతికి వచ్చాయని విమర్శించారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చేందుకు కేసీఆర్ అహర్నిశలు శ్రమించి ప్రాజెక్టులు నిర్మిస్తే, వాటిపై కాంగ్రెస్ పేర్లు పెట్టడం ప్రజల మనోభావాలను అవమానించడమేనని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మహారాష్ట్రతో చారిత్రక ఒప్పందం కుదుర్చుకొని రూ.1200 కోట్లతో చనాకా-కొరాటా బ్యారేజీ, పంప్ హౌస్‌లు, కాలువలు, సబ్ స్టేషన్లు పూర్తి చేసి 2023 సెప్టెంబర్‌లో వెట్ రన్ కూడా విజయవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రాజెక్టుకు అవసరమైన 3,200 ఎకరాల్లో 1,600 ఎకరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరిస్తే, రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఎకరా భూమి కూడా సేకరించలేదని ఆరోపించారు. ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వకుండా ఇప్పుడు రీవెట్ రన్ పేరుతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రూ.500 కోట్లతో 1.5 టీఎంసీల సామర్థ్యంతో సదర్మాట్ బ్యారేజీ సిద్ధం చేసినా, రెండేళ్లుగా చుక్క నీరు నిలపకుండా ఆదిలాబాద్ రైతులను మోసం చేశారని అన్నారు. అప్పటికే 18 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు పంచడం, ఆయన కట్టిన ప్రాజెక్టులకు రిబ్బన్ కట్ చేయడం తప్ప రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసినదేమీ లేదని హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టులకు సున్నాలు వేసి నాదే అంటూ ప్రచారం చేసుకోవడం అల్పబుద్ధికి నిదర్శనమన్నారు. లోయర్ పెన్ గంగా ప్రాజెక్టుకు నిర్మాణంలో వీసమెత్తు కృషి చేయని వ్యక్తి పేరు పెట్టడం ఆదిలాబాద్ ప్రజల మనోభావాలను అవమానించడమేనని పేర్కొన్నారు. ఆదిలాబాద్ వెనుకబాటుకు, పాలమూరు వలసలకు కారణం దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పి రెండేళ్లైనా ఒక్క తట్టెడు మట్టి కూడా తీయలేదని, అప్పట్లో ఆరు సంవత్సరాలు, ఇప్పుడు మరో రెండేళ్లు కాలయాపన చేశారని ఆరోపించారు. గ్రావిటీ కాలువ సాధ్యం కాదని విమర్శించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు తెచ్చి చూపాలని సవాల్ విసిరారు. అబద్ధాలతో అధికారం సాధించినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉన్న ప్రభుత్వం పనులు చేస్తుందని, సాకులు వెతకదని వ్యాఖ్యానించారు. రేవంత్‌కుటుంబ అభివృద్ధి కోసమే రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్లలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లేనని కాగ్ రిపోర్ట్, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో చెప్పిన మాటలను గుర్తు చేశారు. అయినా తప్పుడు ప్రచారం చేయడం ఎందుకని ప్రశ్నించారు. రెండేళ్లలోనే రూ.2.5 లక్షల కోట్ల అప్పులు చేసి ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, తెచ్చిన అప్పులతో ఏం చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలనపై నమ్మకం ఉంటే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. పరిపాలన అంటే శిలాఫలకాలపై పేరు చెక్కించుకోవడం కాదని, ప్రజల మనోఫలకాలపై ముద్ర వేసేలా పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు.

మేడారం అమ్మవార్ల సేవలో టీజీఎస్ఆర్టీసీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 16: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరైన"సమ్మక్క సారలమ్మ జాతర'' ఈ నెల 28 నుండి 31 వరకు జరుగనున్న నేపథ్యంలో అమ్మవార్లకు బంగారం సమర్పించాలనకునే భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సేవల్ని ఏర్పాటు చేసింది. ములుగు (వరంగల్) జిల్లాలోని మేడారంలో సమ్మక్కసారలమ్మ దేవతలను పూజించడానికి తండోపతండాలుగా వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని బంగారం సమర్పించుకోవడం ఆనవాయితీ. అయితే, వివిధ కారణాల వల్ల మేడారం వెళ్లలేని భక్తులకు బంగారం ప్రసాదం తమ ఇంటి వద్దకే చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ తగు ప్రణాళికలు సిద్ధం చేసింది. దేవాదాయ శాఖ సహకారంతో, మేడారం అమ్మవార్ల బంగారం ప్రసాదం ప్యాకెట్లో దేవతల ఫోటోతో సహా బెల్లం, పసుపు కుంకుమ వస్తువులు అందజేయడం జరుగుతుంది. ఇందకుగానూ, బంగారం ప్రసాదం ప్యాకెట్ పొందాలనుకునే భక్తులు కేవలం రూ.299/ చెల్లించాల్సి ఉంటుంది.భక్తులు www.tgsrtclogistics.co.in వెబ్సైట్లో లాగిన్ ద్వారా లేదా సమీపంలోని టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని బుక్ చేసుకోవచ్చు.మరింత సమాచారం కోసం, టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ను 04069440069, 04023450033 నంబర్లలో సంప్రదించవచ్చు.

పోలీసులను ఆశ్రయించిన అనసూయ

- తనపై సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలు, వ్యక్తిగత ధూషణలు చేస్తున్నారు
- పలువురిపై కేసు నమోదు
- సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 16 : ప్రముఖ నటి, టీవీ యాంకర్ అనసూయ భరద్వాజ్ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ట్రోలింగ్, వ్యక్తిత్వ హననం, అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని ఫిర్యాదు చేసింది. తన పరువుకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారంటూ ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. గతేడాది డిసెంబర్ 23 నుంచి తనపై ఆన్‌లైన్ వేధింపులు పెరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుల పేర్లతో పాటు సోషల్ మీడియా లింకులు ఫిర్యాదుతో జత చేశారు అనసూయ. సోషల్ మీడియాలో తనపై క్యాంపెయిన్ తరహాలో దాడి జరిగిందని చెప్పుకొచ్చారు. ఓ ఇంటర్వ్యూలో తన అభిప్రాయం చెప్పిన తర్వాతే ఈ వేధింపులు మొదలయ్యాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అశ్లీల వ్యాఖ్యలు, లైంగిక దూషణలు, బెదిరింపులు జరిగాయని ఫిర్యాదులో వెల్లడించారు. క్రిమినల్ డెఫమేషన్, వ్యక్తిగత వేధింపులు, ఏఐ ఫోర్జరీ వంటి నేరాలు జరిగాయని ఫిర్యాదు చేశారు. అనసూయ ఫిర్యాదుతో మొత్తం 42 మందిపై కేసు నమోదైంది. కొందరు వ్యక్తులు, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఖాతాదారులపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

పలువురిపై కేసులు..

సీనియర్ నటి కరాటే కల్యాణి, ప్రముఖ రేడియో జాకీ శేఖర్ బాషా, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్స్ బొజ్జ సంధ్యారెడ్డి, ప్రియాచౌదరి గోగినేని, పావని, రజిని, నటి విజయలక్ష్మి, ఒక ప్రముఖ ఛానల్ యాంకర్ రోహిత్, మరికొందరు యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు, యాంకర్లు ఉన్నారు. వీరు వివిధ సోషల్ మీడియాల వేదికగా విమర్శలు చేశారని అనసూయ ఫిర్యాదు చేశారు. సైబరాబాద్ పోలీసులు ఐటీ యాక్ట్, సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిందితులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉంది.

సీరియస్‌గా తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు

అనసూయ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, కామెంట్లను పరిశీలించిన అనంతరం.. ఐటీ యాక్ట్, ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా నిందితులకు నోటీసులు జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, న్యాయపరమైన పరిణామాలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. ఈ కేసులతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

విద్యారంగంలో గేమ్ చేంజర్‌గా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

- విద్యలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం
- ఎస్ఎఫ్టీ క్యాలెండర్ ఆవిష్కరణ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 16: తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు గేమ్ చెంజర్ గా ఆవిర్భవిస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. అంతర్జాతీయ స్థాయి ఉద్యను పేదలకు అందిస్తామని అన్నారు. విద్యలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. శుక్రవారం మధిర క్యాంప్ ఆఫీసులో ఆయన ఎస్ఎఫ్టీ 2026 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్టీ రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ సైదులు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాణ, ఎస్ఎఫ్టీ జిల్లా బాధ్యులు గండు యాదగిరి, షేక్ మన్సూర్, రాష్ట్రం లోని ఇతర ఇతర జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ ఆత్మగౌరవ పరిరక్షణకు ర్యాలీ

- నేడు ఉదయం 9 గంటలకు ప్రారంభం
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్ , జనవరి 16: సికింద్రాబాద్ అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు శనివారం ఉదయం 9 గంటలకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్‌లోని గాంధీ విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపారు. 220 ఏళ్ల చరిత్ర కలిగిన సికింద్రాబాద్ అనేక చారిత్రాత్మక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉన్న ప్రాంతమని అన్నారు. లష్కర్ బోనాలకు విశేషమైన చరిత్ర ఉందని, ఇలాంటి ప్రాంతాన్ని నామరూపాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. సికింద్రాబాద్ కమిషనరేట్ లను అక్రమంగా విలీనం చేశారని, ఎందుకు కలిపారో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ పేరు మార్చేందుకు కూడా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ఊర్ల పేర్లు మారుస్తూ తుగ్లక్ పాలన చేస్తోందని తలసాని తీవ్ర విమర్శలు చేశారు. లష్కర్ సాధన సమితి ఆధ్వర్యంలో రెండేళ్లుగా సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం పోరాటం చేస్తున్నామని తెలిపారు. రేపటి కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొంటారని వెల్లడించారు. అన్ని రంగాల సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఈ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇంటికి ఒకరు చొప్పున సికింద్రాబాద్ నివాసితులు ర్యాలీలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఇది పూర్తిగా శాంతియుత ర్యాలీ అని, ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే కోర్టు నుంచి అనుమతి తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.

“



గురజాల నియోజకవర్గం పిన్నెల్లిలో వైసీపీ కార్యకర్త మందా సాల్మన్ హత్యకు టీడీపీ వర్గీయులే కారణం. రాజకీయ కక్షలతో ఇంకెంతమందిని బలితీసుకుంటారు? మీరు పాలించడానికి అర్హులేనా?. రెడ్‌బుక్ రాజ్యాంగం ముసుగులో అరాచకాలు సాగిస్తున్నారు. అనారోగ్యంతో ఉన్న భార్యను చూడటానికి వచ్చిన వ్యక్తిని కిరాతకంగా చంపడం దుర్మార్గం.

- ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి

ఓపెన్ వాయిస్

యుద్ధానికి దారితీస్తున్న సంక్షోభం

ఇరాన్ నిరసనల సంక్షోభం యుద్ధానికి దారితీస్తోంది. అమెరికా సైనికులు ఇరాన్ దిశగా కదులుతున్నాయి. ఇరాన్ ప్రతీకార చర్యలు ప్రకటించింది. నిరసనల్లో హింసకు దిగిన ఇరాన్‌పై ట్రంప్ గట్టి సూచనలు జారీ చేశారు. ఇప్పుడు అది సైనిక చర్యలుగా మారనుంది. పశ్చిమాసియా స్థావరాల నుంచి భారీ ఎయిర్‌ఫోర్స్ ఇరాన్ లక్ష్యంగా ఉంది. యూఎస్ బేసుల నుంచి యుద్ధ విమానాలు, డ్రోన్లు, ఇంధన ట్యాంకర్లు ఇరాన్ వైపు బయలుదేరాయి. ఇది దాడి సిద్ధతలకు స్పష్టమైన సంకేతం. ప్రాంతీయ ఉద్రిక్తత మరింత పెరిగింది. అమెరికా చర్యలకు ఇరాన్ తిరుగుబాటు పన్నుతుంది. దాడి వస్తే తిరిగి ఒడ్డుబాటు చేస్తామని హెచ్చరించింది. ఇది ఉభయకాలీన యుద్ధ ఆకర్షణలకు దారి తీసే అవకాశం.ఇరాన్‌లో నెల కొన్న ఆర్థిక సంక్షోభంతో 20 రోజులుగా దేశ ప్రజలు నిరసనలతో హోరెత్తిస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. వీటికి అమెరికా మద్దతు తెలుపుతోంది. మరోవైపు నిరసనలను ఇరాన్ అణచివేస్తోంది. ఇప్పటికే 2 వేల మందికిపైగా మరణించారు. ఈ క్రమంలో అమెరికా ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతోంది. అయితే దాడి తీవ్రతపై ఇంకా స్పష్టత లేదు. ఖతార్‌లోని అల్ -ఉదెయిద్ వైమానిక బేస్‌తో పాటు పలు ప్రాంతీయ స్థావరాల నుంచి సిబ్బందిని ఆపాద్ చేస్తోంది అమెరికా. ఇరాన్ రక్షణ చర్యలు చేపట్టింది. భారత్,బ్రిటన్ తమ దేశ పౌరులను వెనక్కి రావాలని సూచించాయి. ఆందోళనల సమయంలో మృతుల సంఖ్య 2,571కి చేరింది. ప్రజలు భయంతో రాత్రులు గడుపుతున్నారు. భద్రతా సిబ్బందిలోని సుమారు 100 మందికి సామూహిక అంత్యక్రియలు జరిగాయి. నిరసనకారులపై ఇరాన్ చర్యలు తప్పుబట్టి ట్రంప్ మానవత్వం చూపాలని కోరారు. లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మరోవైపు ఇంటర్నెట్ బ్లాక్ చేసిన ఇరాన్‌లో ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ ఉచిత సేవలు అందిస్తోంది. ఉపగ్రహాల ద్వారా పౌరులు బయటి ప్రపంచంతో కనెక్ట్ అవుతున్నారు. పరిస్థితులు తీవ్రతరం కావడంతో భారత్ తన పౌరులకు ఇరాన్ వదిలి వెళ్లాలని సూచించింది. ఇరాన్ ఆర్థిక, సైనిక ఒత్తిడులు పెరిగ్తున్నాయి.అంతర్జాతీయ మధ్యవర్తిత్వం అవసరమవుతుంది. అమెరికాతో ఏడాదిగా సన్నిహితంగా కొనసాగుతున్న పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ఇప్పుడు ఇరుకున పడుతున్నారు. ఇటీవలే హమాస్‌ను అంతం చేయడానికి పాలస్తీనాలో యూఏఈ సైన్యంతో కలిసి పాల్గొనాలని డొనాల్డ ట్రంప్ పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్‌ను ఆదేశించారు. పాకిస్తాన్ ప్రజలకు పాలస్తీనాతో సత్సంబంధాలు సానుభూతి ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా, హమాస్‌కు వ్యతిరేకంగా రంగంలోకి దిగడం పాకిస్తాన్ సైన్యానికి సవాల్‌గా మారింది. దీనిపై తర్జనభర్జన పడుతున్న తరుణంలో పాకిస్తాన్‌కు ట్రంప్ నుంచి మళ్లీ కీలక ఆదేశాలు అందాయి. ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్న తరుణంలో పాకిస్తాన్‌కు చెందిన 30 వేల మంది సైనికులను ఇరాన్ సరిహద్దులో మోహరించాలని నిర్ణయించినట్లు సమాచారం. పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు అమెరికా అధికారుల నుంచి ఫోన్ కాల్ వచ్చిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌లో అమెరికా-ఇజ్రాయిల్ కూటమి ఏదైనా భూ ఆపరేషన్‌లకు మద్దతుగా ఈ చర్య ఉండవచ్చని వర్గాలు చెబుతున్నాయి. అయితే, అమెరికా ప్రభావంతో పాకిస్తాన్ మధ్యప్రాచ్య విషయాల్లో ఎక్కువగా జోక్యం చేసుకుంటే, దక్షిణాసియాలో బలాబలాలు మారుతాయి. భారత్ తన రక్షణ వ్యూహాలను మళ్లీ పరిశీలించాల్సి వస్తుందిఅమెరికా-ఇజ్రాయిల్ కోఆర్డినేషన్ పెరిగితే, ఇరాన్‌పై భూ దాడుల అవకాశం ఉంది. పాకిస్తాన్ ఈ సందర్భంలో తన సరిహద్దులను రక్షించుకోవడమే కాకుండా, మిత్రరాజ్యాలకు సహాయం చేయవచ్చు. ఇది చైనా, రష్యా వంటి ఇరాన్ మిత్రులతో ఉద్రిక్తతలను పెంచవచ్చు. ప్రపంచ శాంతి కోసం ఐక్యరాష్ట్ర సమితి జోక్యం అవసరం.ఇరాన్‌పై యుద్ధం మొదలైతే చమురు ధరలు పెరగవచ్చు, ఇది భారత్‌లో ఇన్‌ఫ్లేషన్‌కు కారణమవుతుంది. పాకిస్తాన్ -అమెరికా బంధాలు బలపడతాయి, ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతాయి. బాలూచిస్తాన్ వంటి ప్రాంతాల్లో తిరుగుబాట్లు పెరిగే అవకాశం ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ 2.0 ప్రారంభించేందుకు అనువైన సమయం.ఈ చర్యలు మధ్యప్రాచ్య యుద్ధానికి దారితీయవచ్చనే ఆందోళనలు పెరుగుతున్నాయి.

ప్రతిపక్షం
హైదరాబాద్
శనివారం
17.01.2026

అమెరికా ఆధిపత్యంలో అట్టుడుకుతున్న ప్రపంచం

వెనెజువెలాపై సాయుధ దాడి చేయడం, మరోవైపు గ్రీన్ లాండ్ ఆక్రమణకు సంసిద్ధం కావడం, క్యూబా,మెక్సికో లను హెచ్చరించడం అమెరికా దురహంకార ఆధిపత్య ధోరణికి దర్పణం పడుతున్నది. ప్రస్తుతం ఇరాన్- అమెరికాల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఏర్పడ్డాయి. ట్రంప్ ధోరణి మధ్య ప్రాచ్యంలో అశాంతికి పురిగొల్పుతున్నది. ఈ పరిస్థితులనుండి ప్రపంచాన్ని కాపాడేవారెవరు? ట్రంప్ ధోరణి ఇలాగే కొనసాగితే చైనా,రష్యాలతో పాటు మరికొన్ని అమెరికా వ్యతిరేక దేశాలు కూటమిగా ఏర్పడే అవకాశాలున్నాయి. ప్రస్తుత పరిస్థితులు మరో మహా సంగ్రామం వైపు దారితీయవచ్చు.

సుంకవల్లి సత్తిరాజు
9704903463

మధ్యప్రాచ్యం రణరంగంలా మారుతున్నది. ఇరాన్ పై అమెరికా కత్తులు నూరుతుంటే, ఇజ్రాయిల్ పాలస్తీనా పై దాడులకు సిద్ధంగా ఉంది. చైనా తైవాన్ ఆక్రమణకు సంసిద్ధంగా ఉంది. బంగ్లాదేశ్,పాకిస్తాన్ లు భారత్ ను లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతుంటే, రష్యా ఉక్రెయిన్ల మధ్య నాలుగు సంవత్సరాలుగా నిరంతర యుద్ధం జరుగుతున్నది. డోనాల్డ్ ట్రంప్ తనకు తానుగా శాంతి దూతగా వర్ణించుకుంటూ, ఎనిమిది యుద్ధాలను ఆపగలిగానని ప్రగల్భాలు పలుకుతూ, మరో వైపు ఇరాన్ అస్థిత్వాన్ని ప్రశ్నిస్తూ, యుద్ధానికి సై అంటున్నాడు. వెనెజువెలా సార్వభౌమత్వాన్ని దెబ్బతీసి తానే ఆ దేశానికి తాత్కాలిక అధ్యక్షుడినంటూ ప్రకటించుకున్న డోనాల్డ్ ట్రంప్ ఇతర దేశాలను కూడా ఇదే విధంగా గుప్పెట్లో పెట్టుకోవాలని కుటిల నీతి ప్రదర్శిస్తున్నాడు. వెనిజులాలో అస్తవ్యస్త మైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలని,పారదర్శకమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడాలని ప్రజలు కోరుకుంటున్న తరుణంలో అమెరికా వెనిజులా అధ్యక్షుడిని నిర్బంధించి న్యూయార్క్ కు తరలించుకుపోవడం వెనిజులా సార్వభౌమత్వాన్ని పరిహసించడం కాదా? నార్కో టెర్రరిజం పేరుతో మదురో పై నిందారోపణలు చేసిన అమెరికాకు అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అందుకు తగిన విధమైన చర్యలు తీసుకునే అవకాశమున్నా, అందుకు విరుద్ధంగా కారకాస్ పై దాడిచేయడం గతంలో ట్రంప్ పై మదురో చేసిన వ్యాఖ్యలకు ప్రతీకార ధోరణి తీర్చుకున్నట్టుగా ఉంది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పదవీచ్యుతి,నిర్బంధం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైనాయి. అమెరికా దౌర్జన్యాన్నికొన్ని ప్రపంచ దేశాలు ఖండించాయి. కొన్ని దేశాలు ట్రంప్ కు భయపడి గుంభనంగా ఉండిపోయాయి. అమెరికా శత్రు దేశాలతో సహా, కొన్ని మిత్ర దేశాలు,మరికొన్ని నాటో సభ్య దేశాలు ట్రంప్ తీరును తీవ్రంగా తప్పు బట్టాయి. అపారమైన చమురు నిల్వలు గల వెనెజువెలా అత్యంత సంపన్న దేశంగా ఉండాలి. కాని పరిస్థితులు తద్విరుద్ధంగా ఉన్నాయి. వెనెజువెలా ఆర్థికంగా వెనకబడే ఉంది.కారుచౌకగా చమురు ఎగుమతులు చేయడం వలన ఇతర చమురు సంపన్న దేశాల కంటే, వెనెజువెలాకు చమురు వలన లభించే ఆదాయం పడిపోయింది. కేవలం చమురు మీద ఆధార పడడం, ఇతర రంగాలను నిర్లక్ష్యం చేయడం చమురు ధరలు తగ్గినప్పుడు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడం వంటి పరిణామాలు అక్కడ జరుగుతున్నాయి. అమెరికా ఆంక్షలు కూడా వెనెజువెలా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసాయి. సౌదీ అరేబియా, అమెరికాల కంటే వెనెజువెలా లో అధిక నిరూపిత చమురు నిల్వలు (ప్రోవెన్ ఆయిల్ రిజర్వ్స్) కలిగి ఉన్నా, ఆదాయం మాత్రం అతి తక్కువగానే ఉంది. "రిచ్ ఇన్ ఆయిల్ పూర్ ఇన్ వెల్త్" గా వెనిజులా ఆర్థిక ముఖచిత్రం మారింది. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో 10 వ బలమైన ఆర్థిక వ్యవస్థగా బలమైన ఆదాయ వనరులున్న దేశంగా ఎదిగి స్వర్గ ధామంలా విలసిల్లిన వెనిజులా నేడెందుకు దీనంగా మారింది? చైనా

బిలియన్ల డాలర్ల కొద్దీ వెనెజువెలా లో పెట్టుబడులు పెట్టింది. వెనెజువెలా తీసుకున్న అప్పులకు బదులుగా చైనా వెనిజులా నుండి కారుచౌకగా చమురు కొనుగోలు చేస్తున్నది. చమురు క్షేత్రాలపైనే కాకుండా, పలు రంగాల్లో చైనా పెట్టుబడులు పెట్టింది.వెనెజువెలా పై అమెరికా జరిపిన దాడి వలన, వెనెజువెలా అమెరికాకు పాదాక్రాంతం కావడం వలన చైనాకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. ఒకప్పుడు వెనిజులా నుండి భారత్ భారీ స్థాయిలో చమురు కొనుగోలు చేసింది. కాని వెనిజులా పై అమెరికా ఆంక్షలు విధించడంతో భారత్ వెనిజులా నుండి చమురు దిగుమతులను తగ్గించుకుంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో వెనిజులా భారత్ కు చమురు సరఫరా చేస్తుందా? ఇందుకు అమెరికా అంగీకరిస్తుందా?ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా ఒత్తిడికి తలొగ్గి రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్ళు తగ్గించుకున్నా, అందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి. గయానా నుండి భారత్ భారీగా ఆయిల్ దిగుమతులు జరిపే అవకాశముంది. వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో వెనెజువెలా గనుక భారత్ కు చమురు సరఫరా చేస్తే భారత్ కు మేలు జరుగుతుంది. మరి రష్యా సంగతేంటి? రష్యాతో గల అవినాభావ సంబంధాన్ని భారత్ తెంచుకోగలదా? అందుకు భారత ప్రజలు అంగీకరిస్తారా? అమెరికా దురహంకారం భారత్ కు సంకటం లా మారింది.భారత్ ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో డోనాల్డ్ ట్రంప్ రూపంలో భారత్ అనేక క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. అమెరికా విధిస్తున్న టారిఫ్ లను తట్టుకుంటూ వేరే మార్గంలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ, దేశం ఆర్థికంగా ముందుకు సాగడానికి కృషి చేస్తున్నది. ట్రంప్ భారత్ ను "డెడ్ ఎకానమీ" గా అభివర్ణించినా, అమెరికా కంపెనీలు భారత్ లో పెట్టుబడులు పెట్టవద్దని హెచ్చరించినా, భారతీయ విద్యార్థులపై, ఉద్యోగులపై వీసాల భారం మోపుతూ, భారతీయుల ఉద్యోగాలకు ఎసరు పెట్టాలని చూస్తున్నా ఇంతవరకు భారత్ అమెరికాను గాని ట్రంప్ ను గాని పల్లెత్తు మాట అనకుండా, బలవంతునితో వైరం ప్రమాదకరమన్న రీతిలో సహనం పాటించడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. ప్రపంచం ఒకప్పటిలా గిరిగీసుకుని కూర్చునే పరిస్థితులు లేవు. ప్రతీ దేశానికి ఇతర దేశాలతో అవసరం ఏర్పడింది. వాణిజ్య,సాంకేతిక రక్షణావసరాలు ప్రపంచ దేశాల మనుగడకు అవసరం. అయితే అమెరికా లో ట్రంప్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. తనను వ్యతిరేకిస్తున్న దేశాలతో ఎవరూ సంబంధాలు పెట్టుకోవద్దంటూ ట్రంప్ బెదిరించడం,అందుకు తగ్గట్టుగానే కక్ష సాధింపు చర్యలకు దిగడం వలన భారత్ తో పాటు అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ పరిస్థితులు మారాలని ప్రపంచ దేశాలు ఎదురు చూస్తున్నాయి. వెనిజులా దుస్థితి తమకు రాకూడదని చిన్న చితకా దేశాలు మౌనంగా ఉంటున్నాయి. మదురో ను వెంటనే విడుదల చేయాలని రష్యా డిమాండ్ చేసింది. వెనిజులా ను ఆక్రమించాలన్న దురుద్దేశ్యం తమకు లేదని, కేవలం నేరారోపణల పైనే మదురో ను అరెస్టు చేసామని అమెరికా ఒకవైపు చెబుతూనే, వెనెజువెలా చమురును తమ ప్రత్యర్థి దేశాలకు విక్రయించవద్దని,రష్యా చైనా,ఇరాన్, క్యూబా దేశాలను పక్కన బెట్టాలని అమెరికా హుకుం జారీ చేయడం దేనికి సంకేతం? ఒక వైపు వెనెజువెలాపై సాయుధ దాడి చేయడం, మరోవైపు గ్రీన్ లాండ్ ఆక్రమణకు సంసిద్ధం కావడం, క్యూబా, మెక్సికోలను హెచ్చరించడం అమెరికా దురహంకార ఆధిపత్య ధోరణికి దర్పణం పడుతున్నది. ప్రస్తుతం ఇరాన్ అమెరికాల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఏర్పడ్డాయి. ట్రంప్ ధోరణి మధ్య ప్రాచ్యంలో అశాంతికి పురిగొల్పుతున్నది. ఈ పరిస్థితుల నుండి ప్రపంచాన్ని కాపాడేవారెవరు? ట్రంప్ ధోరణి ఇలాగే కొనసాగితే చైనా,రష్యాలతో పాటు మరికొన్ని అమెరికా వ్యతిరేక దేశాలు కూటమిగా ఏర్పడే అవకాశాలున్నాయి. ప్రస్తుత పరిస్థితులు మరో మహా సంగ్రామం వైపు దారితీయవచ్చు. ఈ సారి ప్రపంచ యుద్ధం గనుక సంభవిస్తే అణుబాంబులతో యావత్ భూగోళం భస్మీపటలం కాక తప్పదు.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్)

మీ భూమి మీదేనా..?

ఫిరోజ్ ఖాన్
9640466464

తెలంగాణ రెవెన్యూ వ్యవస్థలో నేడు జరుగుతున్న పరిణామాలు సామాన్య పౌరుడి నిద్రను హరించేవిగా మారాయి. ఇది కేవలం ఒక సాంకేతిక లోపమని చెప్పి తప్పించుకునే పరిస్థితి కాదు. భూమి హక్కుల విషయంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు వ్యవస్థాత్మక దుర్వినియోగం, నిర్లక్ష్యం, అనుమానాస్పద చర్యల శ్రేణిగా ప్రజల్లో బలమైన అభిప్రాయం ఏర్పడుతోంది. ఒకప్పుడు కబ్జాలు కళ్లముందే జరిగేవి, నేడు కంప్యూటర్ స్క్రీన్ వెనుక జరిగే మార్పులు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

నిద్రలేపుతున్న నిజాలు

డిజిటలైజేషన్ పేరుతో తీసుకొచ్చిన సంస్కరణలు పారదర్శకతను పెంచాల్సిన బదులు, కొన్ని సందర్భాల్లో అక్రమాలకు కొత్త మార్గాలు తెరిచాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చలానాల సవరణలు, రికార్డుల మార్పులపై అనేక ఫిర్యాదులు రావడం తేలికగా తీసుకునే అంశం కాదు. భూమి రికార్డులు పూర్తిగా భద్రమనే నమ్మకం సామాన్యుడిలో క్రమంగా క్షీణిస్తోంది.ఈ రోజు నా పేరు ఉన్న భూమి, రేపు అలాగే ఉంటుందా? అన్న సందేహం రైతు గుండెల్లో నాటుకుపోతోంది.

చట్టాల ఆత్మకు విరుద్ధంగా సాగుతున్నాయా రిజిస్ట్రేషన్లు?

రిజిస్ట్రేషన్ చట్టం1908లోని సెక్షన్ 17 ఉద్దేశ్యాన్ని పక్కనపెట్టి, క్షేత్రస్థాయిలో సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని వ్యవహారాలు నడుస్తున్నాయన్న ఆరోపణలు తీవ్రమైనవే. చలానాల మార్పులు, అనుమానాస్పద పత్రాల వినియోగం వంటి చర్యలు భారతీయ న్యాయ సంహితలోని మోసం, నకిలీ పత్రాల సృష్టి, ఫోర్జరీ నిబంధనల పరిధిలోకి వచ్చే అవకాశముందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు, చట్టపరమైన గంభీర పరిణామాలకు దారితీయగల అంశం. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన సెక్షన్ 22ఏ నిషేధిత జాబితా అమలుపై కూడా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో కొందరు రైతుల పట్టా భూములను ఆ జాబితాలో చేర్చినట్లు వచ్చిన ఫిర్యాదులు రాజ్యాంగం కల్పించిన ఆస్తి హక్కును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయన్న భావనకు దారి తీస్తున్నాయి. నిబంధనలు ప్రజల రక్షణ కోసం ఉంటాయా, లేక వేధింపుల సాధనంగా మారాయా అన్న సందేహం తలెత్తడం వ్యవస్థకు సిగ్గుచేటు.

డిజిటల్ భద్రత కూలిపోతుందా?

డిజిటల్ భద్రత అంశం అత్యంత ఆందోళనకరం.

సమాచార సాంకేతిక చట్టం2000 ప్రకారం ప్రభుత్వ దత్తాంశానికి కఠినమైన భద్రతా ప్రమాణాలు ఉండాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నియంత్రణలు బలహీనంగా ఉన్నాయన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. అనధికారికంగా ప్రభుత్వ సర్వర్లలో మార్పులు జరిగితే, అది తీవ్రమైన సైబర్ నేరంగా పరిగణించబడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. లక్షలాది రైతుల వ్యక్తిగత వివరాలు, భూమి హక్కుల సమాచారం ప్రమాదంలో పడుతోందన్న భావనను ప్రభుత్వం తేలికగా విస్మరించలేదు. తహసీల్దార్లు, రిజిస్ట్రేషన్ అధికారులు తమ బాధ్యతలను కేవలం సంతకాల వరకే పరిమితం చేయడం సరిపోదు. చలానాల చెల్లింపులు, డిజిటల్ ఎంట్రీలు, బ్యాంకు ధ్రువీకరణలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించాల్సిన బాధ్యత ఉందన్న వాస్తవాన్ని విస్మరించడం నేరపూరిత నిర్లక్ష్యంగా భావించే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమగ్ర ఆడిట్ జరగకపోవడం వెనుక ఉన్న కారణాలపై కూడా లోతైన విచారణ అవసరం.

వ్యక్తులకాదు.. వ్యవస్థకే విచారణ అవసరం!

మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం కింది స్థాయి సిబ్బందిని బలికొట్టి చేతులు దులుపుకునే ధోరణిని వీడాలి. ఇది వ్యక్తుల సమస్య కాదు వ్యవస్థలోని లోపాలు, అనుమానిత కుమ్మక్కులపై సమగ్ర న్యాయపరమైన తనిఖీ అవసరం. అక్రమ రిజిస్ట్రేషన్లను చట్టబద్ధంగా రద్దు చేయడం, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని బాధ్యుల నుండి రికవర్ చేయడం, బ్యాంకు సర్వర్ ఆధారిత స్వయం ధ్రువీకరణ వ్యవస్థను అమలు చేయడం వంటి కఠిన నిర్ణయాల ద్వారానే ప్రజల్లో మసకబారిన నమ్మకాన్ని పునరుద్ధరించవచ్చు. లేదంటే.. మీ భూమి మీదేనా? అన్న ప్రశ్న రేపు ప్రతి ఇంటి ముందూ నిలబడటం ఖాయం.

(వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

ప్రపంచ యువతకు ప్రేరణ 'బెంజమిన్ ఫ్రాంక్లిన్' జీవితం

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

స్వతంత్ర అమెరికా చరిత్రలో అత్యంత బహుముఖ ప్రతిభాశాలి, పేరెన్నికగల అమెరికా సంయుక్త రాష్ట్రాల "వ్యవస్థాపక పితామహుడు"గా బెంజమెన్ ఫ్రాంక్లిన్ ప్రపంచవ్యాప్త ఖ్యాతిని పొందారు. ఒక సాధారణ వ్యక్తి ఎలాంటి పై చదువులు చదవకుండానే అనేక రంగాల్లో తన ప్రతిభను ప్రదర్శించారు. కవి, రచయిత, పబ్లిషర్, ప్రింటర్, రాజకీయ తత్వవేత్త, సామాజిక చైతన్యశీలి, దౌత్యవేత్త, శాస్త్రవేత్త, సంగీత విద్వాంసుడు, మ్యాప్‌మేకర్, ఆవిష్కర్త, రాజకీయవేత్త, పోస్ట్‌మ్యాన్ అయిన బెంజమెన్ ఫ్రాంక్లిన్ అమెరికా చరిత్రలో చెరగని ముద్ర వేశారు. 1776లో బ్రిటన్ వలసపాలనలో ఉన్న 'అమెరికా స్వాతంత్ర్య ప్రకటన' రచనా కమిటీ ఐదుగురిలో ఒక సభ్యుడిగానే కాకుండా మరో నాలుగు ముఖ్యమైన పత్రాలపై సంతకం చేసిన ఘనుడు బెంజమెన్ ఫ్రాంక్లిన్.

సాధారణ జీవితంతో అసాధారణ సాఫల్యత:

17 జనవరి 1706న ఒక సాధారణ సబ్బులుకొవ్వత్తులు తయారు చేసే కుటుంబంలో జోసియ్య ఫ్రాంక్లిన్‌అభిషా ఫోల్గర్ దంపతులకు పదవ సంతానంగా జన్మించారు. తన 10వ ఏటనే బడికి వెళ్ళడం మానేసి తండ్రికి సహాయకుడిగా సబ్బులు, కొవ్వత్తుల తయారీలో చేయూతను ఇచ్చారు. అలాంటి ఒక అతి చిన్న స్థాయి నుంచి స్వయం కృషితో ఎదిగి అమెరికాలో ఎవరూ సాధించలేని అసాధారణ ఉన్నత స్థాయికి చేరి అందరికీ ఆదర్శంగా నిలిచారు. స్వతంత్ర యూఎస్ ఉనికికి, మనుగడకు గట్టి పునాదులు బెంజమెన్ ఫ్రాంక్లిన్ పుట్టిన రోజు 17 జనవరి నాడు "బెంజమెన్ ఫ్రాంక్లిన్ దినోత్సవం"గా ప్రతి ఏట నిర్వహించడం సముచితంగా ఉన్నది.

బెంజమెన్ ఫ్రాంక్లిన్ బహుముఖీన ప్రతిభ:

వైజ్ఞానిక శాస్త్ర రంగంలో 'లైటెనింగ్ రాడ్', 'బైఫోకల్ కళ్లద్దాలు', 'ఫ్రాంక్లిన్ స్టౌవ్' లాంటి పలు ఉపకరణాలను కనుకొన్నారు. నేటి ఎలక్ట్రానిక్ రంగం మనం నిత్యం వాడుతున్న పదాలు 'బ్యాటరీ', 'చార్జ్', 'కండక్టర్', 'ఎలక్ట్రిఫై' లాంటి ప్రధాన పదాలను ప్రవేశ పెట్టిన ఘనత బెంజమెన్ ఫ్రాంక్లిన్‌ది మాత్రమే. ఇవే కాకుండా 'స్విమ్ ఫిన్స్', 'ఫ్లెగ్జిబుల్ కాతెటర్', 'గ్లాస్ అర్మోనికా', 'లాంగ్ ఆర్మ్', '24గంటల గడియారం' లాంటి పలు పరికరాలను ఆవిష్కరించారు. 'అమెరికన్ ఫిలాసాఫికల్ సొసైటీ' స్థాపకుడిగా చరిత్రలో నిలిచారు. విద్యారంగంలో 'లైబ్రరీ కంపెనీ ఆఫ్ ఫిలడెల్ఫియా'తో పాటు 'ఫిలడెల్ఫియా యూనివర్సిటీ' స్థాపనకు ప్రేరణగా నిలిచిన ఫ్రాంక్లిన్ సామాజికశాస్త్ర రంగంలో 'ఫిలడెల్ఫియా ప్రతినిధి'గా సేవలు అందించి, ఫ్రాన్స్‌కు



తొలి అమెరికా రాయబారిగా అనుభవం గడించారు. అమెరికా తొలి 'పోస్ట్‌మ్యాన్ జనరల్'గా, మరణానంతరం తొలి పోస్టల్ స్టాంప్‌పై బెంజమెన్ ఫ్రాంక్లిన్ ఫోటో ముద్రించడం జరిగింది. పలు పుస్తకాల రచయితగా నేటికీ తన రచనలతో మార్గనిర్దేశనం చేస్తున్న బెంజమెన్ ఫ్రాంక్లిన్ నేటి అభివృద్ధి చెందిన అమెరికాకు గట్టి పునాదులు వేశారు. సాంప్రదాయ విద్యాభ్యాసం చేయకుండానే ఒక వ్యక్తి ఇన్ని రంగాల్లో ప్రపంచ ప్రఖ్యాత స్థాయి వ్యక్తిగా ఎదగడం నమ్మశక్యంగా ఉండదు. తన 84వ ఏట 17 ఏప్రిల్ 1790న తుది శ్వాస విడిచిన బెంజమెన్ ఫ్రాంక్లిన్ జీవితం ప్రపంచ మానవాళికి, ముఖ్యంగా విశ్వ యువతకు నిత్య ప్రేరణగా నిలుస్తున్నది. బెంజమెన్ ఫ్రాంక్లిన్ సూచనలతో పలు నగరాలు, విద్యాలయాలు, యూనివర్సిటీలు, దేశాలు, కార్పొరేషన్లకు పేర్లను ఖరారు చేయడం జరిగింది. స్వతంత్ర అమెరికా వ్యవస్థాపక పితామహుడు బెంజమెన్ ఫ్రాంక్లిన్ జీవితం మనందరికీ దారి దీపం కావాలని కోరుకుందాం, వారి జీవితం నుంచి ప్రేరణను పొందుదాం.

(17 జనవరి "బెంజమిన్ ఫ్రాంక్లిన్ దినోత్సవం" సందర్భంగా)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

యువకులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- తొగుట ఎస్సై రవి కాంతారావు గారు

ప్రతిపక్షం, తొగుట:

యువకులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాలని తొగుట ఎస్సై రవికాంతరావు పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటరావుపేటలో సంక్రాంతి పర్వదినంను పురస్కరించుకొని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామస్థాయి వాలీబాల్ పోటీల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. యువత తలుచుకుంటే సాధ్యం కానిది అంటూ లేదని చదువులతోపాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. సెల్ ఫోన్ వినియోగం మూలంగా అమూల్యమైన సమయం వృథా అవుతుందని యువత గ్రహించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం మూలంగానే 99 శాతం రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నారని ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపొద్దని, హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు. బంగారు భవిష్యత్తు కోసం యువత ప్రణాళిక బద్దంగా ముందుకు సాగాలని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి వాలీబాల్ పోటీల కోసం పిలుపు నిచ్చిన కొన్ని గంటల్లోనే పండుగ ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున హాజరై పోటీలను విజయవంతం చేసిన యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీలలో మొత్తం 10 జట్లు పాల్గొనగా హోరాహోరీ పోరాటం లో విజేతగా పోతారాజు స్వామి ఆధ్వర్యంలో లోకల్ లెజెండ్స్ నిలువగా, పాల హరీష్ కుమార్ గౌడ్ టీం రన్నరప్ గా నిలిచింది. వీరికి షీల్డ్ లతో పాటు విజేతకు రూ :3000, రన్నరప్ కు రూ: 2000 నగదు అందించారు..ఈసందర్భంగా ఎస్ ఐ రవికాంతరావు, ఏఎస్ఐ జీడిపల్లి రాంరెడ్డి, మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి లను గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్ సన్మానించారు. అలాగే పోటీల నిర్వహణ లో కీలక పాత్ర పోషించిన వేముల మెహన్ లాల్, పాల హరీష్ కుమార్ గౌడ్, బెజ్జనమైన నవీన్, ప్రశాంత్, కల్లెపు భాస్కర్ లను సన్మానించారు.. కార్యక్రమం లో ఉప సర్పంచ్ లచోళ్ల లింగం,గ్రామ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య, వార్డు సభ్యులు పిట్ల వెంకటేష్, జహంగీర్, ఎంగలి నరేందర్, మిద్దె శ్రీనివాస్, నాయకులు డబ్బికారి పెంటోజీ, పిట్ల వెంకటయ్య, మత్స్య శాఖ చైర్మన్ కత్తుల నరేష్, పెద్దమ్మ దేవాలయ చైర్మన్ బెజ్జనమైన రవి, సుతారి రాములు, ఈదుగాళ్ల పర్శరాములు, ఎర్రోళ్ల చంద్రం, కత్తుల రమేష్, కొక్కొండ సురేష్, వడ్డె నర్సింలు, పులిగారి నర్సింలు తదితరులు ఉన్నారు..,

డ్రగ్స్ కు దూరంగా ఉంటే ఆరోగ్యానికి మేలు

- టి.వివేక్, ఎస్సై, రాజగోపాలపేట

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 16:

ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడానికి యువత మత్తు పదార్థాలకు(డ్రగ్స్ కు) దూరంగా ఉండాలని రాజగోపాలపేట ఎస్సై టి.వివేక్ సూచించారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాలలో సంక్రాంతి పురస్కరించుకుని 'యాంటీ డ్రగ్ అండ్ హెల్త్ అవేర్‌నెస్ 5కె రన్' నిర్వహించారు. గట్లమల్యాల గ్రామానికి చెందిన వంటేల గోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య శ్రీమతి వంటేల లక్ష్మి, కుమారుడు జీవన్ రెడ్డి ఈ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజగోపాలపేట ఎస్సై టి.వివేక్ ముఖ్య అతిథిగా హాజరై 5కె రన్ ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై టి.వివేక్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మత్తు కాదు, జీవితం కావాలి అనే నినాదంతో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత గ్రామాలు, ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచిన దండ్ల మల్లేశం ప్రథమ స్థానంలో నిలవగా, బానోతు రోహిత్ ద్వితీయ స్థానాన్ని, దండ్ల చందు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇంగ నరేష్, ఉప సర్పంచ్ తిప్పని శ్రీనివాస్, వార్డు సభ్యులు, ఆరోగ్య,వైద్య సిబ్బంది బిందు, ఆశ వర్కర్లు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోజురోజుకూ బీజేపీ బలోపేతం

- 55 మంది సర్పంచులు, 56 మంది ఉప సర్పంచులు, 400 మంది వార్డు సభ్యులు బీజేపీ మద్దతుదారుల గెలుపు
- భైరి శంకర్ ముదిరాజ్, బీజేపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు

ప్రతిపక్షం,నంగునూరు, జనవరి 16:

బీజేపీ రోజురోజుకూ బలోపేతం అవుతోందని, యువత పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. సిద్ధిపేట జిల్లాలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతు దారులు సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఎన్నికవడమే దీనికి నిదర్శనం అన్నారు. నంగునూరు మండలం గట్ల మల్యాల మధిర గ్రామం సంతోష్ నగర్ లో భారతీయ జనతా పార్టీ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయితీ ఎన్నికల్లో వార్డు సభ్యులుగా ఎన్నికైన శ్రీకాంత్, సుధాకర్ లతో పాటు యువకులు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా భైరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 55 మంది సర్పంచులు, 56మంది ఉపసర్పంచ్ లతోపాటు 400మంది వార్డ్ సభ్యులుగా బీజేపీ గెలుపొందారని తెలిపారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో సీ సీ రహదారులు, మురికి కాలువలు, రైతు వేదికలు, స్మశాన వాటికలు, అంగన్వాడి భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు నిర్మాణం జరిగిందని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో సిద్ధిపేట జిల్లాలో మెజారిటీ స్థాయిలో సీట్లు సాధిస్తామని చెప్పారు. వచ్చే మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు చౌదుచర్ల వెంకటరామిరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు వాసరి యాద మల్లు, పరకాల తిరుపతి రెడ్డి, సతీశ్, పడాల తిరుపతి, జీవన్ రెడ్డి, వంశీ, హరీశ్ , భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ప్రభావం.. సిద్ధిపేట రహదారిపై తగ్గిన రద్దీ

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్ధిపేట, జనవరి 16:

సంక్రాంతి పండుగకు సిద్ధిపేట పట్టణంలో రహదారులు విడిపోయాయి. వరుస సెలవులు రావడంతో సిద్ధిపేటలో నివాసం ఉంటున్న వారు సొంత గ్రామాలకు తరలి వెళ్లారు. దీంతో సిద్ధిపేట పట్టణం బోసిపోయింది. నిత్యం రద్దీగా ఉండే మెదక్, కరీంనగర్, హైదరాబాద్ రోడ్లు జనసంచారం లేక వెలవెలబోయాయి. మెజార్టీ ప్రజలు వారి సొంతూళ్లలో పండుగ చేసుకోవడానికే మక్కువ చూపారు. దీంతో జనం గ్రామీణ ప్రాంతాలకు వెళ్లడంతో పట్టణంలోని రహదారులపై జనం కనిపించలేదు. కాగా శనివారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరిగి రద్దీ పెరిగే అవకాశం ఉంది.

మూడు గ్రామాల నూతన పాలకవర్గాలను ఘనంగా సన్మానించిన హనుమాన్ యూత్

ప్రతిపక్షం అక్బర్ పేట- భూంపల్లి, జనవరి 16:

హనుమాన్ యూత్ ఆవిర్భవించిన 22 ఏళ్ల కాలంలో సమాజానికి ఉపయోగపడేలా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని జంగాపల్లి గ్రామ హనుమాన్ యూత్ అధ్యక్షుడు పోలీస్ స్వామి అన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన మూడు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, పాలక వర్గ సభ్యులను హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భూంపల్లి అక్బర్ పేట మండలంలోని జంగాపల్లి, వీరారెడ్డి పల్లి, అల్మాజీ పూర్ గ్రామ సర్పంచ్ లతో పాటు వార్డు సభ్యులను హనుమాన్ యూత్ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని, హనుమాన్ యూత్ తరపున ఎలాంటి సహాయసహకారాలైన అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, అందరితో సత్సంబంధాలను కొనసాగిస్తూ గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయా గ్రామాల సర్పంచ్ లు పేర్కొన్నారు. నూతన పాలకవర్గ సభ్యులకు సన్మానం చేయడంతో పాటు ప్రోత్సహించేలా అండగా నిలబడడం సంతోషకరమన్నారు. సర్పంచ్ లు లావణ్యనర్సింహా రెడ్డి, బాలమల్లేశం గౌడ్, పద్మమల్లేశంతో పాటు వార్డు సభ్యులు, హనుమాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ లో డ్రా
- జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 16 : మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు భీంగల్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీల వార్డులకు మహిళా రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 17న (శనివారం) గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ డ్రా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. భీంగల్ మున్సిపాలిటీకి సంబంధించిన వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 10.00 గంటలకు డ్రా నిర్వహిస్తామని అన్నారు. అదేవిధంగా ఆర్మూర్ మున్సిపాలిటీ వార్డుల ఖరారుకై ఉదయం 10.15 గంటలకు, బోధన్ మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 10.30 గంటలకు, నిజామాబాద్ నగర పాలక సంస్థ డివిజన్లలో మహిళా రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 11.00 గంటలకు డ్రా ప్రక్రియ కొనసాగుతుందని సూచించారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

యువతకు ఆటల పోటీలు

- గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేత
- తిమ్మాయపల్లిలో సంక్రాంతి సందడి

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 16:

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం తిమ్మాయపల్లిలో సంక్రాంతి సందర్భంగా యువకులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా చేర్యాల లక్ష్మయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లను నిర్వహించారు. ఈ పోటీలలో విజయం సాధించిన విజేతలకు గ్రామ సర్పంచ్ చేర్యాల రాజు శుక్రవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చేర్యాల రాజు మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈ ఆటలు పోటీలు గ్రామంలో నిర్వహించడం అభినందనీయం అన్నారు. యువకులు గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదగిరి, మాజీ ఎంపీటీసీ నర్సింలు, మాజీ సర్పంచ్ లతా కృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభా ఉపకార వేతనం నుంచి దివ్యాంగురాలికి ఆర్థిక సాయం

- మానవతను చాటుకున్న కేంద్రీయ విశ్వవిద్యాలయ విద్యార్థి
- హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాల విద్యార్థి హిందూజా ఉదారత *

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 16:

హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయంలో హిందూజా అనే విద్యార్థిని తన మెరిట్ స్కాలర్షిప్ (ప్రతిభా ఉపకార వేతనం) నుంచి దివ్యాంగురాలికి ఆర్థిక సాయం అందించి ఉదారతను చాటుకుంది. సిద్ధిపేటకు చెందిన చింత హిందూజా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలంలో డిగ్రీ చదువుతోంది. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన రజిత భర్త మధు ఆటో నడుపుతూ,కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మూడేళ్ల కిందట మధు మరణించాడు. దీంతో దివ్యాంగురాలైన రజిత తన ముగ్గురు పిల్లల సంరక్షణ, పోషణ కొరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. తెలంగాణ దివ్యాంగుల ఐక్య కార్యాచరణ కమిటీ కమిటీ ప్రతినిధులు, సిద్ధిపేట దివ్యాంగుల స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్ నిర్వాహకులు బొంగోని శ్రీశైలం, పిల్లి అంజయ్య, దివ్యాంగుల జేఏసీ కార్యదర్శి గంధమాల జగన్ తదితరుల ద్వారా రజిత దుస్థితిని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్న చింత హిందూజా తెలుసుకున్నారు. తన మెరిట్ స్కాలర్షిప్ నుంచి దివ్యాంగురాలైన రజితకు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. దేంట్లో భాగంగానే సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చిన హిందూజా శుక్రవారం తన తల్లిదండ్రులు చింత శ్రావణి, సంతోష్ కుమార్ లతో కలిసి నంగునూరుకు వెళ్లారు. దివ్యాంగురాలైన రజిత ఇంటికి వెళ్ళి మనోధైర్యం చెప్పారు. హిందూజా తన మెరిట్ స్కాలర్షిప్ రూ.అయిదు వేలను రజితకు అందించారు. ఆర్థిక సహాయం చేసిన హిందూజాకు రజిత కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంక్షాపూర్ విజయ్ కుమార్, జగన్, బంగారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జైపాల్ రెడ్డి 84వ జయంతి

ప్రతిపక్షం ప్రతినిధి, జనవరి 16

పాలమూరు లో కాంగ్రెస్ నాయకుడు దివంగత మాజీ ఎంపీ సూదిని జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, జనంపల్లి అనిరుద్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పాలమూరు డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌తో రెండు వన్డేలకు బెంచ్‌కే పరిమితమైన బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌ను కనీసం మూడో వన్డేలోనైనా ఆడించాలి. అర్ష్‌దీప్ ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నాడు. జట్టు విజయాల్లో భాగమయ్యాడు. అయినా టీమ్‌లో స్థానం కోసం పోరాడుతున్నాడు. బ్యాటర్ల విషయంలో ఇలా జరగదని, ప్రతిసారీ బౌలర్లే బలవుతున్నారు.

- మాజీ క్రికెటర్ అశ్విన్

ప్రాంతీయం

తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రంలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 16

ఉమ్మడి వరంగల్ జిల్లాలో డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ నిరుద్యోగులకు తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ద్వారా ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకులు డా. కె. జగన్ మోహన్ తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలు, RRB, బ్యాంకింగ్, SSCలకు సంబంధించి 5 నెలల ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉన్న వారు 09012026 నుంచి 30012026 వరకు http://tsstudycircle.co.in/ లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.అర్హులైన అభ్యర్థులకు 08022026 (ఆదివారం) హనుమకొండలో ఉదయం 11.00 నుండి 1.00 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 20022026 నుంచి 19072026 వరకు RTC కాలనీ, వడ్డేపల్లి, హనుమకొండలోని స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఉంటుంది.
శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతితో పాటు అనుభవం కలిగిన అధ్యాపకులచే బోధన అందిస్తారు. గతంలో ప్రభుత్వ సంక్షేమ శాఖల ద్వారా శిక్షణ పొందిన వారు అనర్హులని తెలిపారు.ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని సంచాలకులు కోరారు.

వరంగల్‌కు CGHS వెల్‌నెస్ సెంటర్ ఎంపీ డా. కడియం కావ్య కృషికి ఫలితం

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 16

వరంగల్ నగరంలో CGHS వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కోసం వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య చేసిన నిరంతర కృషికి కీలక విజయం లభించింది. వరంగల్ ఆకాశవాణి పరిధిలోని సిబ్బంది క్వార్టర్స్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.
ఈ వెల్‌నెస్ సెంటర్ ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు వైద్య చికిత్సలు, వ్యాధి నిర్ధారణ తదితర ఆరోగ్య సేవలు వరంగల్‌లోనే అందుబాటులోకి రానున్నాయి. సుమారు 15 వేల మందికి పైగా లబ్ధిదారులకు ఇది ఉపయోగపడనుంది.వెల్‌నెస్ సెంటర్‌ను తన ఎంపీ నిధులతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎంపీ డా. కడియం కావ్య వెల్లడించారు. అలాగే వెంటనే పనులు ప్రారంభించాలని CGHS డైరెక్టర్‌ను కోరారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారమవడంపై కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ వరంగల్ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు

వాగులో పురాతన శిల్పాలు: వెయ్యేళ్ల చరిత్రకు దర్పణం

- **పొట్లపల్లిలో జైనమత ఆనవాళ్ళు**
- **గుర్తించిన ఔత్సాహిక పరిశోధకుడు కలిపాక శ్రీనివాస్**

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 16:

సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని ఎల్లమ్మ వాగులో చరిత్రకు అద్దం పట్టే వెయ్యేళ్ల నాటి శిల్పాలను నంగునూరుకు చెందిన ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించారు. తన పరిశోధనలో భాగంగా కలిపాక శ్రీనివాస్ శుక్రవారం పొట్లపల్లి గ్రామంలో ఎల్లమ్మ వాగును మేకల ఎల్లయ్యతో కలిసి పరిశీలించారు. మల్లన్న గుడి దగ్గర నుండి తెచ్చి వాగులో వేసిన శిల్పాలను గుర్తించారు. వీటిలో నల్ల రాయి మీద ధ్యాన ముద్రలో చెక్కిన శిల్పం 11వ శతాబ్దం నాటి జైన మత 24 వ తీర్థంకరుడు మహావీరుని విగ్రహం ఉంది. ఈ శిల్పం ఆధారంగా ఒకప్పుడు పొట్లపల్లి గ్రామంలో జైన మతం కూడా విలసిల్లిందని చెప్పవచ్చు. ఈ శిల్పం పక్కన 12, 13 శతాబ్దాల నాటి సప్త మాతృక పలకం, 13 వ శతాబ్దం నాటి వినాయక విగ్రహం, చెదిరిపోయిన శాసన స్థంభం ఉన్నాయి.గతంలో ఈ శిల్పాలు మల్లన్న దేవాలయం వద్ద ఉండేవి. ఇటీవల మల్లన్న దేవాలయం పునర్నిర్మాణ సమయంలో వీటిని ఇక్కడ పడవేసి ఉంటారని భావిస్తున్నారు. గ్రామ గత చరిత్రకు ఆధారాలు అయిన వీటిని గ్రామస్తులు తిరిగి మల్లన్న గుడి వద్దకు చేర్చి గ్రామ చరిత్ర కాపాడుకోవాలని ఔత్సాహిక చరిత్ర పరిశోధకుడు, కొలిపాక శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంపీ రఘునందన్ రావు

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 16:

బీజేపీ సిద్ధిపేట పట్టణ ఉపాధ్యక్షుడు గరిపల్లి సాయిబాబా ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు హైదరాబాద్‌లోని తన నివాసంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ క్యాలెండర్ ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో మరింత సన్నిహితంగా మమేకమై సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బిజెపి వన్ నేషన్, వన్ ఎలక్షన్ సిద్దిపేట జిల్లా కో కన్వీనర్ తొడుపునూరి వెంకటేశం,బిజెపి సిద్దిపేట పట్టణ అధ్యక్షులు కాసనగుట్టు సంతోష్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు గరిపల్లి సాయిబాబా, బిజెపి నాయకులు భాషా శ్రీకాంత్ యాదవ్,బొల్లు ప్రకాష్,బిజెపి కార్యకర్తలు కర్రోళ్ల చిరంజీవి,కర్రోళ్ల భారత్,కర్రోళ్ల అజయ్,చెన్నోజ్ మణికిరణ్, బండారి ప్రవీణ్,మోత్కూరి శివ, గరిపల్లి అంజి,గరిపల్లి ప్రశాంత్,గంగళ్ళ బన్నీ అమర్,కర్నాకర్,మొతుకూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- **భద్రకాళి - బాసర వరకు ఆలయాల అభివృద్ధికి చర్యలు**
- **వచ్చే బడ్జెట్లో రూ. 70 కోట్లను కేటాయించి కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధి**
- **రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**
- **హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రతిపక్షం ,హనుమకొండ:

రాష్ట్రంలో అన్ని ఆలయాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ లోని శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం ఆలయంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని మంత్రులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు ఆశీర్వచనం అందించారు. అంతకుముందు త్రిశూలం కూడలిని మంత్రులు ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో మీడియాతో రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్లను దర్శించుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఆలయంలో స్వామివారు భీకర రూపం కాకుండా ముఖంపై కోర మీసాలతో దర్శనమిస్తుంటారు కాబట్టి కోర మీసాల వీరభద్ర స్వామిగా భక్తులు కొలుస్తుంటారని పేర్కొన్నారు. పురాణాల ప్రకారం తపస్సు చేసి స్వయంభుగా శ్రీ వీరభద్ర స్వామి వెలిశారని భక్తులు నమ్ముతారని అన్నారు. కాకతీయుల కాలం నాటి వేంగి చాళుక్యులు ఈ ఆలయాన్ని నిర్మించారని, తదనంతరం కాకతీయ రాజైన బేతరాజు 1 ఆలయాన్ని పునరుద్ధరించారని చరిత్ర చెబుతుందన్నారు. విగ్రహ ప్రతిష్ట 1600 సంవత్సరం ప్రాంతంలో కొందరు కుమ్మరులు కొండపైకి వంట చెరుకు కోసం వెళ్ళినప్పుడు స్వామివారు స్వప్నంలో కనిపించారని అన్నారు. కొండపై ఉన్న స్వామివారి విగ్రహాన్ని కిందకు తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్టించారని కథనం ప్రాచుర్యంలో ఉందన్నారు. ప్రతి సంవత్సరం ఆలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు. ప్రతి జనవరి నెలలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయని పేర్కొన్నారు. లక్షలాదిమంది భక్తులు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని దర్శించుకుంటారని తెలిపారు. స్వామి వారి కళ్యాణం, కుంకుమార్చన, కోడేలు కట్టడం, అగ్నిగుండం, బండ్లు తిరిగే కార్యక్రమం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయని అన్నారు. సంతానం లేని వారు కోరమీసం స్వామివారికి సమర్పించుకుంటే సంతానం కలుగుతుందనే నమ్మకం భక్తుల్లో ఉందన్నారు. భక్తులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తారని అన్నారు. స్వామి వారిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం వసతి సదుపాయాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. భక్తులకు ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారని తెలిపారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. భక్తులు మొక్కులు చెల్లించుకుని క్షేమంగా వచ్చి ఇంటికి వెళ్లేలా సౌకర్యాలు ఉండే విధంగా అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. దర్శనం నిమిత్తం మూడు లైన్లు ఉండే విధంగా అధికారులను ఆదేశించామని, మహిళలు, చిన్నపిల్లల9 తల్లులు, వృద్ధులు, దివ్యాంగులకు, అదేవిధంగా విఐపి, సాధారణ దర్శనాలకు దారులు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జాతర ను ప్లాస్టిక్ రహితంగా కూడా చేయాలని తెలియజేశామన్నారు. భద్రకాళి అమ్మవారు అంటేనే ఉగ్ర స్వరూపిణి అని పేర్కొన్నారు. ఉగ్ర స్వరూపిణి అయిన భద్రకాళి అమ్మవారి సమేతంగా శ్రీ వీరభద్ర స్వామి ఇక్కడ కొలువుదీరి ఉన్నారని పేర్కొన్నారు. అదేవిధంగా నిత్యం నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని అన్నారు. కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ రూ. 70 కోట్లను ఇవ్వాలని ప్రతిపాదనలు ఇచ్చారని, మాస్టర్ ప్లాన్, అన్ని అనుమతులకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో వచ్చే బడ్జెట్లో నిధులను కేటాయించి ఆలయ అభివృద్ధి పనులను చేపడతామన్నారు. భద్రకాళి నుండి బాసర వరకు ఆలయాలను అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సబ్ కమిటీని వేయమని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకు తెలిపారని అన్నారు. భద్రకాళి దేవాలయ మాడవీధుల నిర్మాణ పనులు, వేములవాడ మాడవీధుల నిర్మాణ పనులు సాగుతున్నాయని చెప్పారు. సమ్మక్క సారలమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు నభూతో నభవిష్యత్తు అన్న విధంగా ఉన్నాయని అన్నారు. మేడారంలో సమ్మక్క సారక్క గిరిజన జాతర జరగబోతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆలయాలకు సందర్శకులు ఎక్కువగా రావాలని, ద్వారా రెవెన్యూ అన్నారు. తెలంగాణ ప్రజలందరికీ వీరభద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వీరభద్ర స్వామి ఆశీస్సులు అందజేస్తూ ముందుకు నడిపించాలని కోరుకున్నట్లు చెప్పారు.
ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్లను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి దర్శించుకుని ఆశీర్వచనం తీసుకున్నట్లు తెలిపారు. కాకతీయ కాలంనాటి వీరభద్ర స్వామిని దర్శించుకున్నారని పేర్కొన్నారు. ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. చారిత్రక దేవాలయ అభివృద్ధికి గతంలోనే దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖను కలిసి వివరించగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.దాదాపు 70కోట్ల రూపాయలతో దేవాలయానికి సంబంధించి ప్రాకారాలు, మాఢ వీధులు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, అనుమతులు ఇచ్చి భక్తులకు ఉపయోగపడేవిధంగా పూర్తి సహకారాన్ని అందజేస్తున్నందుకు మంత్రి సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. ఉత్తర తెలంగాణలోనే కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి కోర మీసాల దేవుడిగా, గుమ్మడికాయల దేవుడిగా, కోరిన కోరికలు తీర్చే దేవుడిగా శ్రీ భద్రకాళి సమేత వీరభద్రుడిగా ఈ ప్రాంత ప్రజల విశ్వాసానికి అనుగుణంగా భవిష్యత్తులోనూ తమ బాధ్యతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతోదేవాలయాన్నిఅభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి కొండా సురేఖను కోరారు. మకర సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఆలయ కార్యనిర్వాహణాధికారి కిషన్ రావు, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐ రాజు, ఇతర అధికారులు,పలువురు ప్రజా ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి..

- **నిబంధనలు అతిక్రమిస్తే ఫైన్‌తో పాటు లైసెన్స్ రద్దుకు చర్యలు.**
- **జిల్లా పోలీస్ కార్యాలయంలో "నో హెల్మెట్ – నో ఎంట్రీ" అమలు.**
- **మెదక్ జిల్లా ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు.**

ప్రతిపక్షం,మెదక్ టౌన్ జనవరి 16

ఎరైవ్ అలీవ్ రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు "నో హెల్మెట్ - నో ఎంట్రీ" కార్యక్రమాన్ని మెదక్ జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు.జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే సిబ్బంది, ప్రజలు హెల్మెట్ ధరించకుండా వస్తే కార్యాలయ ప్రాంగణంలోకి అనుమతి ఉండదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్‌లకు ద్విచక్ర వాహనాలపై వచ్చే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు.ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తామని పేర్కొన్నారు.హెల్మెట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ లో వాహనం నడపడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలు ప్రాణాలకు ప్రమాదకరమని పేర్కొన్నారు. ఇటువంటి నిబంధనల ఉల్లంఘనపై ఎలాంటి ఊపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మొదటి సారి పట్టుబడితే ఫైన్ విధిస్తామని,అదే తప్పిదాన్ని మరోసారి చేస్తే కేసును మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (MVI)కు రాసి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
రోడ్డు ప్రమాదాల్లో అనవసరంగా ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితిని నివారించాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమన్నారు.హెల్మెట్ ధరించడం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, మన జీవితాన్ని రక్షించే ముఖ్యమైన భద్రతని ప్రజలు గుర్తించాలన్నారు.రోడ్డు భద్రతా నియమాలు పాటించినప్పుడే Arrive Alive లక్ష్యం సాకారం అవుతుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిబ్బందితో కలిసి నేను భారతదేశ పౌరుడిగా, మోటారు వాహనాల చట్టంలో పొందుపరచిన రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తానని, ఇతరుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తోటి రోడ్డు వినియోగదారులను గౌరవిస్తానని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణశుద్ధితో నిర్వహిస్తానని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నియమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించనని, ప్రజలందరూ మన రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి నా వంతు సహకారం అందిస్తానని దృఢసంకల్పంగా ప్రమాణం చేస్తున్నాను అని రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ ఎస్ మహేందర్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, సీఐ లు సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఎసై లు, పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఎన్పీడీసీఎల్‌కు ప్రతిష్టాత్మక 'ఇప్పాయి పవర్ అవార్డ్2026'

- **సాంకేతిక ఆవిష్కరణలు, వినియోగదారుల సేవలకు దక్కిన గుర్తింపు.**
- **AI మోడల్, RTFMS, FPI సాంకేతికతలతో తగ్గిన విద్యుత్ అంతరాయాలు.**
- **అవార్డును సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డికి అందజేసిన అధికారులు.**

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 16



నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ మరో అంతర్జాతీయ స్థాయి గుర్తింపును దక్కించుకుంది. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (IPPAI) వారు ప్రకటించిన 'ఇప్పాయి పవర్ అవార్డ్స్ 2026' లో ఎన్పీడీసీఎల్ 'ఇన్నోవేషన్ అవార్డు'ను కైవసం చేసుకుంది. ఈ నెల 10వ తేదీన కర్ణాటకలోని బెల్గాంలో జరిగిన 26వ 'రెగ్యులేటర్స్ & పాలసీమేకర్స్ రిట్రీట్' కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఈ (ప్రాజెక్ట్స్) సురేందర్ ఈ అవార్డును అందుకున్నారు.
శుక్రవారం హన్మకొండ, నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి గారికి సీఈ (ప్రాజెక్ట్స్) సురేందర్ ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్‌లో ప్రవేశపెట్టిన వినూత్న సాంకేతిక పద్ధతుల వల్లే ఈ అవార్డు దక్కిందని తెలిపారు.

కెరీర్ తొలినాళ్లలో ఇబ్బందులు పడ్డా. సీనియర్ స్టార్లతో రొమాన్స్ చేయాలని దర్శకుడు కోరితే కంఫర్ట్ లేకపోవడంతో నో చెప్పా. ఆ సమయంలో హీరోయిన్‌ను మార్చాలని అరుస్తూ దర్శకుడు నాపై ఒత్తిడి చేయాలని చూశారు. అయినా వెనక్కి తగ్గొద్దని నిర్ణయించుకున్నా. చివరకు దర్శకుడే సారీ చెప్పారు. ఇండస్ట్రీలో సురక్షితమైన వాతావరణం ఉండాలి.
- హీరోయిన్ తమన్నా

ప్రాంతీయం

వరద ప్రభావిత ప్రాంతాలలో కేంద్ర బృందం పర్యటన

- హనుమకొండ జిల్లాలో భారీ వర్షా లతో దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఇండ్లను పరిశీలించిన బృందం ప్రతినిధులు

ప్రతిపక్షం ప్రతినిధి హన్మకొండ జనవరి 16

: అక్టోబర్ నెలలో మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ముంపు, కోతకు గురైన రోడ్లు, కూలిన ఇండ్లను కేంద్ర అధికారుల బృందం హనుమకొండ జిల్లాలో శుక్రవారం పరిశీలించారు.జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో జరిగిన పంట నష్టం, రోడ్లు, విద్యుత్, ఇండ్ల నష్టం పై అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో కేంద్ర బృందం పర్యటించింది. ముందుగా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామ ప్రధాన రహదారి వరద ధాటికి దెబ్బతిన్న రోడ్డును కేంద్ర అధికారుల బృందం, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను రైతులు, స్థానికులను కేంద్ర అధికారుల బృందం ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. రైతులు స్థానికులతో మాట్లాడి ఏయే పంటలకు ఎంత నష్టం వాటిల్లింది, ఎంత మేరకు రోడ్లు దెబ్బతిన్నాయనే వివరాలను సంబంధిత శాఖల అధికారులను, స్థానికులను అధికారుల బృందం అడిగి తెలుసుకున్నారు. వరద ధాటికి దెబ్బతిన్న రోడ్లు, పంట పొలాలకు సంబంధించిన ఛాయా చిత్ర ప్రదర్శనను కేంద్ర బృందం పరిశీలించింది. దేవునూరు నుండి ముప్పారం గ్రామం మధ్యలో ఉన్న లో లెవెల్ బ్రిడ్జి సమీపంలో పంట నష్టం జరిగిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముప్పారం గ్రామంలో భారీ వర్షాల కారణంగా తోట కమలమ్మ కు చెందిన ఇల్లు కూలిపోగా ఆ ఇంటిని పరిశీలించి ఆ మహిళతో మాట్లాడారు. అక్కడనుండి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం విశ్వనాథ కాలనీలో వరదలకు దెబ్బతిన్న కాలువను పరిశీలించారు. కొప్పూరు లో వర్షాలకు కూలిన ఇంటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హనుమకొండ సమ్మయ్య నగర్, గోపాల్ పూర్ ఊర చెరువు కట్ట, వరద ముంపునకు గురైన అమరావతి నగర్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి కేంద్ర అధికారుల బృందం పరిశీలించారు.ఈ సందర్భంగా కేంద్ర అధికారుల బృందం వెంట జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ ఆర్ అండ్ బి అధికారులు , ఉదయ్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జగదేవపూర్ మండలంలో కలకలం

- తిగుల్ గ్రామ సరిహద్దుల్లో పంట పొలాల్లో పులి అడుగుజాడలు గుర్తింపు
- అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తుల్లో భయం

ప్రతిపక్షం, గజ్వేల్(జగదేవపూర్), జనవరి 16:

జగదేవపూర్ మండలంలోని తిగుల్ గ్రామ సరిహద్దుల్లో ఉన్న పంట పొలాల్లో "పులి" అడుగుజాడలు కనిపించడం కలకలం రేపింది. శుక్రవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు అనుమానాస్పదమైన భారీ అడుగుజాడలను గమనించి వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, అవి పులి అడుగుజాడలుగా నిర్ధారించారు. సుమారు 2 కిలోమీటర్ల మేర పొలాల గుండా అడుగుజాడలు కొనసాగినట్లు అధికారులు తెలిపారు. సమీప అటవీ ప్రాంతం నుంచి పులి గ్రామ సరిహద్దుల్లోకి వచ్చిన అవకాశముందని అంచనా వేస్తున్నారు.ఈ ఘటనతో తిగుల్ గ్రామంతో పాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా రైతులు, కూలీలు పొలాలకు వెళ్లేందుకు వెనుకాడుతున్నారు. చిన్న పిల్లలు, పశువుల భద్రతపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఫారెస్ట్ అధికారులు గ్రామస్తులను అప్రమత్తం చేస్తూ, రాత్రి సమయాల్లో బయటకు రావద్దని, ఒంటరిగా పొలాల వైపు వెళ్లవద్దని సూచించారు. పులి కదలికలపై నిఘా పెంచడంతో పాటు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే పై అధికారుల అనుమతితో అదనపు చర్యలు చేపడతామని వెల్లడించారు.పులి గ్రామ పరిధిలోకి మళ్లీ రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అటవీ శాఖను కోరుతున్నారు. ఈ ఘటనపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

నూతన సర్పంచ్,ఉప సర్పంచ్ లకు ఘన సన్మానం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ జిల్లా జనవరి 16

నూతనంగా ఎన్నికైన రాయికోడు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్,వార్డు సభ్యులను రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మందీపుల గోపాల్ రెడ్డి కుమారులు యం హర్షవర్ధన్ రెడ్డి, యం కుర్మ రెడ్డి లు గురువారం గ్రామ పెద్దల తో కలిసి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు స్వీట్లు అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామం లోని సమస్యలను పార్టీలకతీతంగా ప్రజలందరిని కలుపుకొని పని చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామ అభివృద్ధి విషయంలో తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ శశికళ రవికుమార్, ఉప సర్పంచ్ మ్యాథరి గోపాల్ వార్డు సభ్యులు రమేష్, గద్ద మీద శీను, పుల్లారి రాజు, జయలక్ష్మి , సూరం జయశ్రీ, మ్యాథరి వెంకటేశ్వరి, మ్యాతరి మంజుల, నౌసు నర్సింలు, మ్యాథరి అంజనేయులు తో పాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఎస్ఎఫ్–2026 విజయవంతానికి సమన్వయం అవసరం

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 16:

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ (ఎస్ఐఎస్ఎఫ్)-2026 రాష్ట్ర, జిల్లా ప్రతిష్టకు కీలకమని, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు.

ఈ నెల 19 నుంచి 23 వరకు రామచంద్రపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించనున్న ఎస్ఐఎస్ఎఫ్-2026 ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఎంట్రెన్స్-ఎగ్జిట్ మార్గాలు, సైనేజీ, ఎగ్జిబిట్ల ఏర్పాట్లు, విద్యుత్ కనెక్షన్లు, భద్రత, పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించారు.సౌత్ ఇండియా నలుమూలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో వసతి, భోజనం, రవాణా, వైద్య సదుపాయాలు, తాగునీరు వంటి ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ బ్యాకప్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్, ఆర్డీవో రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, నోడల్ అధికారి లింబాజీ, ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, పటాన్ చేరు తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలని బీజేపీ ధర్నా

ప్రతిపక్షం మంచిర్యాల జనవరి 16

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో గల మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల పట్నంలో బిజెపి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ముందు నాయకులు ధర్నా నిర్వహించారు అనంతరం మున్సిపాలిటీ అధికారికి వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేరే పెల్లి రఘునాథరావు బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ గవర్నమెంట్ అధికారంలోకి వచ్చి మూడవ సంవత్సరం గడుస్తున్నప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన హామీలు పట్టణంలోనూ సింగరేణి ప్రాంతంలోనూ గ్రామీణ ప్రాంతంలోనూ నెరవేర్చడం లేదని ఆరోపించారు వినతి పత్రం అందిద్దామని మున్సిపల్ కమిషనర్ కు ఇవ్వబోతే అందుబాటులో లేకపోవడం విడ్డూరమన్నారు మున్సిపల్ కార్పొరేషన్ లో ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ డంపింగ్ యార్డ్ గోదావరిపై బిరుజనిర్మానం సింగరేణి కార్మికులకు నిలబట్టాలు ఎన్నికలలో ఇచ్చిన హామీలను పేర్కొన్నారు ఇటువంటి హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం విడ్డూరమన్నారు మున్సిపల్ పట్టణంలో ఒక భయానక వాతావరణం నెలకొన్నదని తెలిపారు ఎమ్మెల్యే గెలిసి మూడవ సంవత్సరం గడుస్తున్న ఇచ్చిన హామీ నెరవేరడం లేదని ఆరోపించారు మునిసిపాలిటీ మౌలిక వసతులు సింగరేణి గ్రామీణ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు రోడ్ల నిర్మాణం గా మారిందని అన్నారు మున్సిపాలిటీలో రోడ్లను విస్తరించే క్రమంలో బిల్డింగులను తొలగించారని ఇంతవరకు పునర్నిర్మాణం డ్రైనేజీ సిస్టమును నెలకొల్పలేదన్నారు వారి బిజినెస్ అధ్వాన్నంగా మారిందన్నారు లక్ష్మీ టాకీస్ నుంచి ఎసిసి వరకు రోడ్డు నిర్మాణం వెంటనే చేపడదామని ఇప్పటివరకు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెద్దపల్లి పురుషోత్తం గాజుల ముఖేష్ గౌడ్ పట్టణ అధ్యక్షుడు అమీర్ శెట్టి రాజు మే రెడీ శ్రీనివాస్ బెల్లంకొండ మురళి లతోపాటు పెద్ద ఎత్తున మహిళలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతకు “అరైవ్ అలైవ్ 2026” ప్రత్యేక కార్యక్రమం

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 16:

రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణరక్షణ లక్ష్యంగా పోలీస్, రవాణా, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా “అరైవ్ అలైవ్-2026” కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 10 రోజుల పాటు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి, హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ఎస్పీ సూచించారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు.

70 సార్లకు పైగా రక్తదానం

- కానిస్టేబుల్ చంద్రశేఖర్‌కు సన్మానం

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 16:

సిద్దిపేట పట్టణంలోని 19వ వార్డు అంబేద్కర్ నగర్‌లో జువ్వన్న ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 70 సార్లకు పైగా రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ దాసరి చంద్రశేఖర్‌ను టూ టౌన్ సీఐ ఉపేందర్ సన్మానం చేశారు. రక్తదానం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడిన దాసరి చంద్రశేఖర్ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఈ సందర్భంగా వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మిత్రులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు.

మల్లన్న టీం పై శివాజీ టీమ్ విజయం

ప్రతిపక్షం మిడిదొడ్డి, జనవరి 16:

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన డిపిఎల్ (ధర్మారం ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువ నాయకుడు రంగనబోయిన యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లో గ్రామానికి చెందిన 8 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ లో శివాజీ టీం, మల్లన్న జట్టు తలపడ్డాయి. ఫైనల్లో శివాజీ టీం విజేతగా నిలిచి, ట్రోఫీతో పాటు 10116 నగదు ప్రోత్సాహకాన్ని అందుకున్నారు. రన్నరప్ గా నిలిచిన మల్లన్న టీంకు 5016 రూపాయలతో పాటు ట్రోఫీని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తోట కమలాకర్ రెడ్డి విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు గురికాకుండా ఉండేందుకు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. నేటి యువత సెల్ ఫోన్ లకు బానిసలు కాకుండా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. క్రీడల్లో యువత నైపుణ్యాన్ని చాటి రాష్ట్ర స్థాయికి ఎదగాలని సూచించారు. క్రీడాకారులకు ఏదైనా సహకారం కావాలంటే తన వంతు సహకారాన్ని అందిస్తానని వెల్లడించారు. అనంతరం ఆర్గనైజర్ యాదగిరిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ బాలరాజు వార్డు సభ్యులు పలువురు పాల్గొన్నారు.

బుల్డోజర్ రాజకీయాలు సిగ్గుచేటు : సీపీఎం

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి, 16:

సంగారెడ్డి జిల్లాలో దళితులపై బుల్డోజర్ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు విమర్శించారు. కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామానికి చెందిన దళితుడు రాములు ఇంటిని కూల్చిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్‌బి ఆర్ఐ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. రాములు స్వంత భూమిలో నిర్మించుకుంటున్న ఇంటిని అక్రమంగా కూల్చివేశారని, బాధిత కుటుంబంపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. అలాగే ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

జహీరాబాద్‌లో సంక్రాంతి ముగ్గు కార్యక్రమం

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 16:

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సంక్రాంతి ముగ్గు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు, చైనా మాంజా వల్ల ప్రాణాలకు ముప్పు, మద్యం సేవించి వాహనాలు నడపరాదనే అంశాలపై అవగాహన కలిగించే చిత్రాలతో మహిళా కానిస్టేబుల్ వనజ ముగ్గును అందంగా రూపొందించారు.ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయాల ప్రాముఖ్యతతో పాటు ప్రజల్లో భద్రతపై చైతన్యం కల్పించామని పోలీసులు తెలిపారు. పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

పండుగలు...పూర్వీకులు మనకు ఇచ్చిన కానుకలు

- సంగారెడ్డి రామ్ నగర్ రామ్ మందిర్‌లో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మల
- పతంగులు ఎగరవేస్తూ, చిన్ననాటి మిత్రులతో కలిసి డ్యాన్స్ చేసిన జగ్గారెడ్డి, నిర్మల

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 16 :

సంగారెడ్డి పట్టణ రాంనగర్ రామ మందిర్ లో జగ్గారెడ్డి ఆధ్వర్యం లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగ సందర్భంగా తన చిన్ననాటి మిత్రులతో కలిసి పతంగులు ఎగరవేశారు. అనంతరం పాత పాటలకు స్టెప్పులు వేస్తూ సందడి చేశారు. ఉదయం 12 గంటలకు మొదలుకుని సాయంత్రం 5 గంటల వరకు ఈ సంబరాలు కొనసాగాయి. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగలు మనకు పూర్వీకులు ఇచ్చిన కానుకలని, కష్టాలను, బాధలను మర్చిపోయి పండుగ రోజు అందరూ కుటుంబాలతో సంతోషంగా గడుపుతారన్నారు. సంక్రాంతి పండుగ ను ప్రజలందరూ సుఖ: సంతోషాలతో జరుపుకోవాలని ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్, రామ్ మందిర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య.

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 16 :

మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి వార్డులో రూ. కోటి 17లక్షల90వేల నిధులతో సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ, మూర్తుజగూడ వార్డులో రూ. కోటి 19లక్షల 6వేల నిధులతో బీటీ రోడ్డు, సురంగల్ వార్డులో రూ. 85లక్షల 20వేల నిధులతో సీసీ, అండర్ డ్రైనేజీ, మొయినాబాద్ లో రూ. కోటి 90లక్షల 20వేల నిధులతో సీసీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పెద్ద మంగళారం వార్డులో రూ. కోటి 92లక్షల 60వేలతో సీసీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అప్పోజిగూడలో రూ. 95లక్షలతో సీసీ, బీటీ రోడ్డు, చిలుకూరు వార్డులో రూ. కోటి 41లక్షలతో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టణ ప్రగతితో మున్సిపాలిటీలను అన్ని రంగాలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రణాళిక ద్వారా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుతో పాటు మొయినాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఖాజా మోయినోద్దీన్, మేనేజర్ జమీల్, డీఈ చిరంజీవులు, టీపీపీ కార్యవర్గ సభ్యులు దర్శన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఎన్కేపల్లి నాయకులు శ్రీశైలం, చంద్రయ్య, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు జైపాల్ రెడ్డి, మల్లేష్, ఆశోక్ యాదవ్, హన్మంత్ యాదవ్, రవీందర్ రెడ్డి, రామకృష్ణగౌడ్, సరికొండ అనంతరెడ్డి, మల్లారెడ్డి, అశోక్ యాదవ్, నాగేందర్ గౌడ్, గడ్డం వెంకట్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రానికి 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి రానుంది. ‘ఎఎం గ్రీన్’ కంపెనీ కాకినాడలో 1.5 మెట్రిక్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఎక్స్‌పోర్ట్ టర్మినల్ ఏర్పాటు చేయబోతుంది. దీనివల్ల 8వేల మందికి ఉద్యోగాలు రాబోతున్నాయి.
ఇక్కడ ఉత్పత్తి అయిన అమ్మోనియాను జపాన్, జర్మనీ, సింగపూర్‌కు ఎగుమతి చేస్తారు.
- ఏపీ మంత్రి నారా లోకేశ్

ప్రాంతీయం

ఆయుష్ వైద్య సేవలు జిల్లాలోని ప్రజలకు చేరువయ్యేలా పని చేయాలి..

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 16:

ఆయుష్(ఆయుర్వేద, యునాని, హోమియోపతి) వైద్య సేవలు జిల్లాలోని ప్రజలకు చేరువయ్యేలా పని చెయ్యాలని ఆయుష్ డాక్టర్లకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో జిల్లాలోని ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని పిఎచ్ సి, సిఎచ్ సి లలో ఆయుష్ వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్, ఫార్మాసిస్ట్ సమీక్ష నిర్వహించారు. ఆయుష్ కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్, ఫార్మాసిస్ట్ వెకెన్సీ లిస్ట్ తయారుచేయాలి. జిల్లాలో నిర్మించిన యోగ షెడ్లలో యోగ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రజలకు యోగ సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో ఆయుర్వేద, యునాని, హోమియో పతి వైద్య సేవలు వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి తెలపాలని ఆయుష్ సేవలను విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని ఆదేశించారు. వృద్ధులకు కాళ్ళు చేతులు నొప్పులతో బాధపడే వారికి ఆయుష్ వైద్యం వైపు మళ్లిస్తే సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా నొప్పులు తగ్గుతాయని వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఓపి కౌంట్ పెంచాలని ఆసుపత్రిలో సమయవేళలు పాటించాలని పిఎచ్ సి, సిఎచ్ సి లోని మెడికల్ ఆఫీసర్ తో సమన్వయంతో వైద్యం అందించాలని తెలిపారు. ఆయుష్ కేంద్రంలో పరికరాలు, మెడిసిన్ కోసం పై అధికారులకు లెటర్ పెట్టీ తెప్పించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి, హాస్టల్ లో హలోపతి డాక్టర్ లతోకలిసి వైద్య సేవలు అందించాలని తెలిపారు. సిద్దిపేట పట్టణం లోని 50 పడకల ఆయుష్ ఆసుపత్రిని ప్రారంభానికి సిద్ధం చెయ్యాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనరాజ్, జిల్లా ఆయుష్ ప్రోగ్రామ్ మేనేజర్ భాను తేజ, జిల్లా ఆయుష్ ఇంచార్జ్ అధికారి ఉమాదేవి, ఆయుష్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవడమే శ్రేష్ట ఫౌండేషన్ లక్ష్యం..

- శ్రేష్ట ఫౌండేషన్ సీఈవో ఎఫ్రాహిం

ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 16 :

నిరుపేదలను ఆదుకోవడంలో శ్రేష్ట ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీఈవో కంకణాల ఎప్రాహిం అన్నారు. శుక్రవారం శ్రేష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ పెరమండ్ల నర్సింహులు తో కలిసి శేరిపల్లి బందారం లో నిరుపేద వృద్ధులకు దుప్పట్ల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సంస్థ సీఈవో ఎప్రాహీం మాట్లాడుతూ. అవసరంలో ఉన్న పేదలు,వృద్ధుల సంక్షేమానికి డోనర్స్ సహకారంతో ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెరమండ్ల రాములు, వార్డు సభ్యులు, శ్రేష్ట పౌండేషన్ కంకణాల జోసెఫ్, బిక్షపతి,శ్రేష్ట వాలంటీర్స్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

దేశంలో శక్తివంతమైన ఆలయాల్లో శ్రీ విద్యాధరి క్షేత్రం ఒకటి

- భారత ప్రభుత్వ అదనపు సంచాలకులు డాక్టర్ సంతోష్ కుమార్ పాండే

ప్రతిపక్షం, గజ్వేల్(వర్గల్), జనవరి 16:

భక్తుల ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా శక్తివంతమైన ఆలయాల్లో దేశంలో ఒకటిగా వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రం అదే కోవకు చెందుతుందని భారత ప్రభుత్వ అదనపు సంచాలకులు డాక్టర్ సంతోష్ కుమార్ పాండే స్పష్టం చేశారు. సంక్రాంతి పర్వదినాన విద్యాధరి క్షేత్రంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు ఆయనను శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి జ్ఞాపక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పురాతన, పుణ్య క్షేత్రాలకు కొదవలేదని, అయితే ఆధ్యాత్మిక శక్తి, చారిత్రక నేపథ్యం, ప్రాముఖ్యత, సంస్కృతుల సమ్మేళనమే దేశానికి శ్రీరామరక్ష అని అన్నారు. పవిత్ర స్థలంగా పేరొందిన ఈ పుణ్యక్షేత్రం దినదినాభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలు మేనేజర్ రఘు పవన్ ఆయనకు వివరించగా, సంతృప్తి వ్యక్తం చేస్తూ ఆలయ చైర్మన్ చంద్రశేఖర శర్మకు ధన్యవాదాలు తెలిపారు.

గణితంలో ఆదుర్తి శ్రీవల్లికి పీహెచ్‌డీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 16 :

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ఆదుర్తి శ్రీవల్లి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'మైక్రోఫ్లూయిడ్ అప్లికేషన్ల కోసం మైక్రోఛానల్ లో విద్యుదయస్కాంత ప్రవాహం యొక్క గణిత నమూనా, విశ్లేషణ'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు.

ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోతాహర్ రెజా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన మైక్రోఛానళ్లలో సంక్లిష్ట ద్రవాల యొక్క విద్యుదయస్కాంత హైడ్రోడైనమిక్ ప్రవాహాలపై సైద్ధాంతిక అంతర్దృష్టులను అందిస్తుందని తెలిపారు. ల్యాబ్‌ఆన్‌చిప్ సిస్టమ్ లు, లక్ష్య ఔషధ పంపిణీ వంటి అధునాతన మైక్రోఫ్లూయిడ్ వినియోగానికి ఇది వీలు కల్పిస్తుందన్నారు.డాక్టర్ శ్రీవల్లి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తోనే పేదలకు న్యాయం

- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధిస్తాం
- కాంగ్రెస్ పార్టీ లో చేరిన పలువురు బిఆర్ఎస్ నాయకులూ
- పార్టీ కండువా వేసిన డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ యాదవ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 16:

రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో జెడ్పీటీసీ ,ఎంపిటిసిలు మెజారిటీ సీట్లు సాధిస్తామని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చిన్నకోడూరు మండల కేంద్రానికి చెందిన పలువు బిఆర్ఎస్ పార్టీ నాయకులూ మీసం నాగరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ చేరారు .వారికీ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు .అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి , సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలోకి తీసుకెళ్లాలని కోరారు.సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ నాయకత్వంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలోకి తీసుకెళ్లే విధంగా ఇంటింటికి వెళ్లే విధంగా పార్టీని బలోపేతం చేసేవిధంగా పనిచేస్తామన్నారు .ఈ సందర్భంగా పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులూ .బబ్బూరు కనకయ్య @యేసు ,మన్నే రాములు ,కొలను చెంద్రయ్య ,బబ్బూరు రవి ,యాదగిరి , మినయ్యా ,జంగాపల్లి మల్లేశం ,జంగపల్లి బుమాయ్య ,రాజయ్య ,దుర్గయ్య,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిమల్ల మల్లేశం ,గుండు వెంకట్ ,బర్ల స్వామి,ఒగ్గు కిసాన్ ,జేరిపోతూ బాబు ,సాయి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తాం..

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య
- మున్నూరు కాపు సంఘం క్యాలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 16:

ఏప్రిల్ నెలలో రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తామని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య తెలిపారు.శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో సిద్దిపేట మున్నూరు కాపు సంఘం (పటేల్స్) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల సాయిరాం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంక్రాంతి సెలవుల్లో నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్న సంఘం కార్యవర్గాన్ని అభినందించారు. ఏప్రిల్ నెలలో రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. కొమురవెల్లిలో సత్రం ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

జిల్లా అధ్యక్షుడు నాయకం మల్లయ్య, సంఘం అధ్యక్షుడు సొప్ప పూర్ణ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సందుల సతీష్ కుమార్ మాట్లాడుతూ మున్నూరు కాపులు ఐక్యంగా ఉంటే హక్కులు సాధించుకోవచ్చని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీలు మున్నూరు కాపులకు సముచితంగా టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మ్యాడ శ్రీధర్, మాచవరం హరికిషన్, శ్రీనివాస్, మహేందర్, ముత్తినేని ఎల్లం, గడిల శ్రీకాంత్, బొప్ప సత్యం, ఆకుల మల్లేశం, ఆకుల బాలయ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది..

- రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు వహీద్ ఖాన్
- 28వ వార్డులో ఉచిత విద్యుత్ ప్రొసీడింగ్స్ పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 16:

ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు వహీద్ ఖాన్ తెలిపారు.రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు 28వ వార్డులో ఉచిత విద్యుత్ ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ట్రాన్సకో డీఈ రాంచంద్రయ్య పాల్గొని లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేసి ఉచిత విద్యుత్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు వహీద్ ఖాన్ మాట్లాడుతూ...సంక్రాంతి పండుగ సెలవు రోజు కూడా విద్యుత్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఉచిత విద్యుత్ ప్రొసీడింగ్స్ పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు మేలు చేసే విధంగా విద్య, వైద్యంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. 28వ వార్డులో ఉచిత విద్యుత్ పథకం అమలుకు సహకరించిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇంచార్జి మంత్రి వివేక్, సిద్దిపేట కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజనరేందర్, స్పెషల్ అధికారులు ఖాజ ఖుతుబొద్దీన్, జాహెద్, లైన్‌మాన్ రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు షాబాజ్ ఖాన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ లో డ్రా
- జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో,

నిజామాబాద్, జనవరి 16 : మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు భీంగల్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీల వార్డులకు మహిళా రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఈ నెల 17న (శనివారం) గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ డ్రా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. భీంగల్ మున్సిపాలిటీకి సంబంధించిన వార్డుల మహిళా రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 10.00 గంటలకు డ్రా నిర్వహిస్తామని అన్నారు. అదేవిధంగా ఆర్మూర్ మున్సిపాలిటీ వార్డుల ఖరారుకై ఉదయం 10.15 గంటలకు, బోధన్ మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 10.30 గంటలకు, నిజామాబాద్ నగర పాలక సంస్థ డివిజన్లలో మహిళా రిజర్వేషన్ల ఖరారు కోసం ఉదయం 11.00 గంటలకు డ్రా ప్రక్రియ కొనసాగుతుందని సూచించారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ కోరారు.

బస్ డిపో డ్రైవర్లకు "ఏసిపి" రోడ్డు సేఫ్టీ పై అవగాహన

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి16:

ప్రతి ఏటా నిర్వహించే రోడ్ సేఫ్టీ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం నాడు గజ్వేల్ ఏసిపి నరసింహులు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి, ఇన్స్పెక్టర్ రవికుమార్, కలిసి గజ్వేల్, ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ రూల్స్, డ్రైవింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించడం జరిగింది. ముఖ్యంగా ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే బస్సులను పార్కు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ కై కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్ కుమార్, డిపోసిఐ బాబు, మరియు ఆర్టీసీ డిపో డ్రైవర్లు మెకానికులు తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల వెబ్ సైట్ ఆవిష్కరణ..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 16:

సిద్దిపేట జిల్లా మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలలో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించిన TGMREIS అడ్మిషన్ల వెబ్‌సైట్, పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆవిష్కరించారు.ఈ వెబ్‌సైట్ ద్వారా 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌తో పాటు ఇతర తరగతుల బ్యాక్‌లాగ్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. అడ్మిషన్లు నేటి నుంచే ప్రారంభమయ్యాయని, అర్హులైన విద్యార్థులు tgmreistelangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రిన్సిపాళ్లు ,సిబ్బంది పాల్గొన్నారు.



ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినా రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తీసేయడం వెనుక కోచ్ గంభీర్ హస్తం ఉండొచ్చు. అగార్కర్ కోచ్ ప్రభావానికి లోనై ఉండొచ్చేమో. రోహిత్ లాంటి లెజెండ్‌ను పక్కన పెట్టడం క్రీడా ధర్మానికి విరుద్ధం. 2027 వరల్డ్ కప్ ఆడగల సత్తా ఉన్న హిట్‌మ్యాన్‌ను కాదని గిల్‌కు బాధ్యతలు ఇవ్వడంలో లాజిక్ లేదు. ఇది రోహిత్‌ను అవమానించడమే.

- క్రికెటర్ మనోజ్ తివారీ

20న కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటించనున్న బీజేపీ

భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ఈనెల 19వ తేదీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. 20వ తేదీన పార్టీ కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. బీజేపీ జాతీయ రిటర్నింగ్ ఆఫీసర్ కే లక్ష్మణ్ ఆ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను రిలీజ్ చేశారు. జనవరి 19వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య నామినేషన్ దాఖలు చేసుకోవాలి. ఇక సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నామినేషన్ విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. ఒకవేళ అవసరం అయితే పోలింగ్ 20వ తేదీన నిర్వహించనున్నారు. ఆ రోజే కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తామన్నారు. అయితే పార్టీ వర్గాల ప్రకారం ప్రస్తుతం బీజేపీ జాతీయ తాత్కాలిక అధ్యక్షుడిగా ఉన్న నితిన్ నబిన్ ఆ పదవిని గెలుచుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జేపీ నడ్డా స్థానంలో నబిన్ ఆ బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. నితిన్ నబిన్‌కు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా అండ ఉన్నది.

విశ్వ వీక్షణం

ప్రకృతి ఒడిలో పుణ్యస్నానాలు

ఒక్క రోజే లక్షల మంది భక్తుల స్నానాలు

ఈ నెల 18న సింగరాయ జాతర

కత్తుల లక్ష్మారెడ్డి, సిద్దన్నపేట

పచ్చని ప్రకృతి, గలగల పారే వాగు, ఎత్తైన గుట్టల మధ్య ఆధ్యాత్మిక తను పంచుతూ అంగరంగ వైభవంగా శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ క్షేత్రం జాతరకు సిద్ధమైంది. పుష్య మాసం అమావాస్యకు జరగబోతోంది. ఈ నెల 18 వ తేదీన ఒక్క రోజు మాత్రమే జరిగే జాతరకు లక్షల మంది భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. పచ్చని ప్రకృతి ఒడిలో, గలగల పారే వాగు, ఎత్తైన గుట్టల మధ్య ఆధ్యాత్మిక తను పంచుతూ అరుదైన క్షేత్రంగా సింగరాయ ప్రతాపరుద్ర లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం విరాజిల్లుతోంది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజక వర్గంలోని కోహెడ మండలంలోని కూరెళ్ళ, తంగళ్లపల్లి, బస్వాపూర్ గ్రామాల సరిహద్దుల్లో జరిగే ఈ జాతర, భక్తుల పాలిట కొంగు బంగారంగా మారింది. ఈ జాతరకు సిద్దిపేట, కరీంనగర్, వరంగల్, మెదక్, హైదరాబాద్ జిల్లాలతో పాటు పూనే, ముంబాయి, షోలాపూర్, భీవండి తదితర పట్టణాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు ఉదయాన్నే జాతరకు వస్తారు. పచ్చని చెట్లు, కొండల మధ్య సెలయేరు పిల్లగాలిని భక్తులు ఆస్వాదిస్తారు.

ఒకే ఒక్క రోజు పగలు మాత్రమే...

అన్ని జాతరలకు బిన్నంగా కేవలం ఒకే ఒక్క రోజు పగలు మాత్రమే ఈ సింగరాయ జాతర జరుగుతుంది. ప్రతి ఏటా పుష్య బహుళ అమావాస్య రోజున ఉదయం నుండి సాయంత్రం వరకు జాతర కొనసాగుతుంది. భక్తి భావంతో పాటు విహార యాత్రగా భక్తులు ఇక్కడికి వస్తారు. భక్తులు వేకువజామునే జాతరకు వచ్చి, తూర్పు నుండి పడమరకు ప్రవహించే మోయ తుమ్మెద వాగులో పుణ్య స్నానాలు ఆచరించి, నడక దారిన ఎత్తు వంపులు గల కొండలు ఎక్కి గుహలో కొలువుదీరిన లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకుంటారు. భక్తులు మోకాళ్లపై పాకుతూ వెళ్లి స్వామిని దర్శించుకోవాల్సి ఉంటుంది. అనంతరం మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు సేవిస్తారు. చీకటి పడక ముందే భక్తుల తిరిగి వెళ్ళిపోతారు. చీకటి పడక ముందే వెళ్ళక పోతే స్వామివారికి తలనొప్పి లేస్తుందని నమ్ముతారు. దట్టమైన అడవిలో భక్తుల క్రూర మృగాల బారిన పడకుండా ఉండేందుకే సాయంత్రంలోగా భక్తులు సురక్షితంగా ఇళ్లకు చేరుకునేందుకే అనాటి పాలకులు ఈ నమ్మకాన్ని ప్రచారం చేసినట్లు తెలుస్తోంది.

సింగరాయ జాతర చారిత్రక విశిష్టత...

ఈ క్షేత్రం 13వ శతాబ్దానికి చెందినదని చరిత్ర చెబుతోంది. ఓరుగల్లును పరిపాలించిన కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడు ఈ ప్రాంతంలో ప్రాజెక్టును నిర్మించేందుకు వాస్తు శిల్పి, నీటిపారుదల శాఖ నిపుణుడైన సింగరయ్యను 13వ శతాబ్దంలో పంపాడు. ప్రకృతి రమణీయతలో కొండలు, మోయ తుమ్మెద వాగు ఆహ్లాదకరమైన వాతావరణానికి సింగరయ్య మంత్ర ముగ్దుడయ్యాడు. ఇక్కడే స్థిరపడి కొండపై గుహలో తపస్సు చేశాడని ప్రసిద్ధి. అక్కడే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతున్నది. దీంతో ఈ క్షేత్రానికి అప్పటి పాలకుడైన ప్రతాపరుద్రుడు, స్వామిని ప్రతిష్ఠించిన సింగరయ్య పేర్లతో ప్రతాపరుద్ర సింగరాయ జాతరగా ప్రసిద్ధి చెందింది. శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకునే దారిలోనే చతుర్ముఖ బ్రహ్మ విగ్రహం, ఆంజనేయ స్వామి విగ్రహాలు నెలకొల్పి ఉన్నాయి.

అనేక చారిత్రక ఆనవాళ్లు...

జాతర జరిగే స్థలం నుండి ఐదు కిలోమీటర్ల దూరంలో అనేక చారిత్రక ఆనవాళ్లు లభించాయి. ఇందులో బౌద్ధ మతానికి విగ్రహాలు బయల్పడ్డాయి. చతుర్ముఖ బ్రహ్మ విగ్రహం, గాజు పరిశ్రమ అవశేషాలను కనుక్కున్నారు. బృహత్ శిలాయుగ సమాధులైన రాకాసి గూళ్ళు కనిపిస్తాయి. మోయ తుమ్మెద నదీ తీరం వెంట వందలాది సంవత్సరాలు ఆది మానవులు జీవనం సాగించినట్లు పురావస్తు శాస్త్రజ్ఞులు తేల్చారు.

జానపద నమ్మకం..

పురాణ కాలంలో శివుడు భూలోకంలో సంచరిస్తూ తాను వెలిసేందుకు అవసరమైన స్థలం కోసం వెదుకుతూ ఈ ప్రాంతంలో సంచరించాడని చెబుతారు. వేములవాడ లోని ప్రస్తుత భీమేశ్వర ఆలయంలో కొలువు తీరి ఆగి తన అల్లుడైన ప్రతాప రుద్ర సింగరయ్యను అనువైన స్థలం వెతకడం కోసం పంపినట్లు జానపద కథ ప్రచారంలో ఉంది. లొద్దులకు వచ్చి ఇక్కడి ప్రకృతి రమణీయతకు ముగ్ధుడైన సింగరయ్య ఇక్కడే ఉండి పోయాడు. వెళ్లిన సింగరయ్య తిరిగి రాకపోయేసరికి విషయం తెలుసుకున్న శివుడు ఆగ్రహించి సంవత్సరంలో ఒక్క రోజు మాఘమామవాస్య(పుష్య మాసం బహుళ అమావాస్య) రోజు మాత్రమే భక్తులు దర్శిస్తారని, భక్తులు సాయంత్రం లోగా వెళ్ళక పోతే సింగరయ్యకు తల పోటు వస్తుందని శపించాడట. ఇందుకు ప్రతిగా శివుడు నెలవై ఉన్న భీమేశ్వరాలయంలో గబ్బిలాలు నివసిస్తాయని సింగరయ్య శపించాడని జానపదులు చెబుతారు.

నమ్మకం ఏదైనా దట్టమైన అడవిలో భక్తులు క్రూర మృగాల బారిన పడకుండా ఉండేందుకే సాయంత్రంలోగా భక్తులు సురక్షితంగా బయటకు రావాలని ఈ ఏర్పాటు చేసినట్లు స్పష్టం అవుతోంది.

ఔషధ గుణాలతో మేలు

మోయతుమ్మెద వాగు (అక్కెనపల్లి పెద్ద వాగు) సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ వరకు దక్షిణం వైపు నుంచి ఉత్తరం వైపు ప్రవహించిన ఈ వాగు బస్వాపూర్ వద్ద తూర్పు నుంచి పడమర వైపు ప్రవహిస్తుంది. బస్వాపూర్, తంగళ్ళపల్లి, కూరెళ్ళ గ్రామాల మధ్య దట్టమైన అడవుల మధ్య లోయల్లోకి ప్రవహిస్తుంది. రెండు తాటి చెట్ల లోతులో ఉండే ఈ లోయలో వాగు ఔషధ మొక్కలు, చెట్ల బెరడు, ఆకులను కలుపుకుని ప్రవహించడం వల్ల ఈ నీటికి ఔషధ గుణం వస్తుంది. ఈ నీటిలో స్నానాలు చేస్తే చర్మవ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయని నమ్ముతారు. తూర్పు నుంచి పడమర వైపు ప్రవహించే నదుల్లో మాఘమాస స్నానాలు చేయడం వల్ల పిత్రు దేవతలకు సద్గతి ప్రాప్తిస్తుందని విశ్వసిస్తారు. దీంట్లో భాగంగానే ప్రతి సంవత్సరం మాఘమాస అమావాస్య నాడు ఇక్కడ పుణ్య స్నానాలు ఆచరించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలి వస్తారు.

జాతరలో శాకాహార వంటలు...

జాతరలో శాకాహార వంటలు ప్రత్యేకం. చిక్కుడు, టమాటా, వంకాయలు, కలిపి ఇక్కడి నీటితో వంటలు చేసుకుని కుటుంబ సభ్యులు సహపంక్తి భోజనాలు చేస్తారు. వన మూలికలను తాకుతూ ప్రవహించే వాగులో చెలిమెలు తోడి వచ్చే నీటితో చేసిన వంటలు రుచిగా ఉండటమే గాక, దివ్య ఔషధంలా పనిచేస్తాయని భక్తులు నమ్ముతారు.

సరిహద్దు వివాదం పరిష్కారం ఎప్పుడు.?

కూరెళ్ల, తంగళ్లపల్లి గ్రామాల మధ్య సింగరాయ జాతర సరిహద్దు వివాదం ప్రతి ఏటా కొనసాగుతూనే ఉంది. ఈ వివాదాన్ని పరిష్కరించడంలో అధికారులు విఫలం అవుతున్నారని భక్తులు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. జాతర సమయం రాగానే ఇరు గ్రామాలకు చెందిన కొందరు ముఖ్య నాయకులు, ప్రజలు జాతర తమదంటే తమదని వాదిస్తున్నారు. సరిహద్దు వివాదమే సింగరయ్య ప్రాంత అభివృద్ధికి అడ్డంకిగా మారింది. వివాదం వల్ల కనీస రవాణా సౌకర్యం లేక భక్తుల మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వస్తోంది. సరిహద్దు వివాదం సాకుతో అధికారులు ఈ క్షేత్ర అభివృద్ధికి చర్యలు చేపట్టడం లేదు. మాఘమామవాస్య సమయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సంవత్సరం రూ.10 లక్షలను మంజూరు చేశారు.

పర్యాటక అవకాశాలు

చుట్టూ గుట్టలు, దట్టమైన అడవి, పక్షుల కిలకిలరావాల మధ్య ఈ క్షేత్రం ప్రకృతి ఆరాధకులకు స్వర్గధామంలా ఉంటుంది. సమీపంలోనే నిర్మించిన సింగరాయ ప్రాజెక్టు పర్యాటకులకు అదనపు ఆకర్షణ. కూరెళ్ళ తంగళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న సరిహద్దు వివాదాల కారణంగా ఈ ప్రాంతం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ వివాదాన్ని పరిష్కరించి, అవసరమైన రోడ్డు సౌకర్యాలు, వసతులు కల్పిస్తే సింగరయ్య ప్రాంతం గొప్ప పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది.

ఆదివారమే జాతర..

ఆధ్యాత్మికతకు, ప్రకృతి సౌందర్యానికి, సాత్విక జీవనానికి సింగరాయ జాతర ప్రతిబింబం. ఆధునిక కాలంలోనూ తన విశిష్టతను కాపాడుకుంటూ వస్తున్న ఈ జాతరను సందర్శించడం ప్రతి ఒక్కరికీ ఒక అద్భుతమైన అనుభవం. ఈ నెల 18 వ తేదీన(ఆదివారం) జరగనున్న ఈ జాతరకు తరలి రావాలని భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దూర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు సింగరయ్య జాతరలో స్నానాలు చేసేందుకు సంక్రాంతి పండుగకు ఇళ్లకు చేరుకున్నారు.

జాతరకు ఇలా చేరుకోవచ్చు..

కోహెడ మండలం కూరెళ్ళ, తంగళ్లపల్లి, బస్వాపూర్, గుండారెడ్డి పల్లి గ్రామాల శివారులోని గుట్టల్లో జాతర సాగుతుంది. సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి బస్వాపూర్ వరకు బస్సులో వచ్చి, అక్కడ నుంచి ఆటోలో జాతరకు చేరుకోవచ్చు. సిద్దిపేట జిల్లా కేంద్రం నుండి శనిగరం వరకు బస్సులో వచ్చి అక్కడ నుంచి తంగళ్ళపల్లి, కోహెడ మీదుగా ఆటోలో జాతరకు ప్రాంతానికి వెళ్ళొచ్చు. అయినప్పటికి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవాలంటే సుమారు మూడు నుంచి నాలుగు కిలోమీటర్లు నడవాల్సిందే.

ముంబయిలో ముగిసిన ఠాక్రేల హవా..

ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేనకు ముంబయి మహానగరం కీలకమైనది. దశాబ్దాల క్రితం ఇక్కడే బాల్‌ఠాక్రే సారథ్యంలో శివసేన ఆవిర్భవించింది. అనంతరం దేశ ఆర్థిక రాజధానిపై వారి హవానే కొనసాగింది. అయితే తాజా ఎన్నికల్లో ఉద్ధవ్‌కు ఆయన సోదరుడు రాజ్ అండగా నిలిచినా .. విజయం అందుకోలేక చతికిలపడింది. భాజపాశివసేన కూటమి ఘనవిజయం సాధించింది. ప్రస్తుత ఫలితాల సరళి ప్రకారం.. బీఎంసీలోని 227 వార్డుల్లో భాజపా, శివసేనలతో కూడిన మహాయుతి కూటమి 116 వార్డుల్లో ముందంజలో ఉంది. శివసేన (యూబీటీ) కూటమి 85 వార్డుల్లో ఆధిక్యం సాధించింది.బాల్‌ఠాక్రే ఉన్న సమయంలో భాజపాతో సత్సంబంధాలు ఉండేవి. ఉద్ధవ్ పగ్గాలు చేపట్టిన అనంతరం రెండు పక్షాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. తమకే మహారాష్ట్ర సీఎం పదవి కావాలని కోరడం.. అందుకు కమలనాథులు అంగీకరించకపోవడంతో కూటమి విచ్ఛిన్నమైంది. అంతకు ముందే బాల్‌ఠాక్రే సోదరుడి కుమారుడైన రాజ్‌ఠాక్రే పార్టీ నుంచి వేరుపడి మహారాష్ట్ర నవ నిర్మాణ సేన ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అప్పుడే పార్టీ బలహీనపడింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాతో శివసేన కలిసి పోటీ చేసింది. అనంతరం కాంగ్రెస్, ఎన్సీపీలతో కలిసి ఉద్ధవ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత పరిణామాల్లో శివసేన నుంచి ఏక్‌నాథ్ శిందే ఫిరాయించి భాజపాతో చేతులు కలపడంతో ప్రభుత్వం పడిపోయింది. దీంతో శిందే సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. అప్పటి నుంచి ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన (యూబీటీ) ప్రాభవం తగ్గిపోయింది.రెండు దశాబ్దాల పాటు ఎడమొహం.. పెడమొహంగా ఉన్న ఠాక్రే సోదరులు ఇటీవలే ముంబయి ఎన్నికల్లో కలిసి పోటీచేశారు. అయినా అధికారం రాలేదు. దీంతో సున్నా ప్లస్ సున్నా అని రాజకీయంగా సెటైర్లు వస్తున్నాయి. ఈ ఎన్నికల్లో భాజపాశివసేన కూటమి బలీయంగా ఆవిర్భవించింది. గుజరాతీయులు, తమిళులపై ఠాక్రే సోదరుల విమర్శలు పలు వర్గాల్లో భయం కలిగించాయి. దీంతో ఆయా వర్గాలు భాజపాకు ఓటు వేసినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల సరళిని బట్టి చూస్తే శివసేన (యూబీటీ) వర్గం మళ్లీ గర్జించే పరిస్థితి లేదని చెప్పవచ్చు. ఒకప్పుడు ఠాక్రేలు ముంబయి మహానగరాన్ని కనుసైగలతో శాసించిన పరిస్థితి నుంచి తెరమరుగు కావడం రాజకీయ స్వయంకృతమే.

ఇరాన్ ఉద్రిక్తతలపై పుతిన్, నెతన్యాహు కీలక చర్చలు!

ఇరాన్‌లో కొనసాగుతోన్న ఉద్రిక్తతలపై రష్యా అధ్యక్షుడు పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఫోన్ కాల్‌లో మాట్లాడుకున్నారు. ఇరాన్ సంఘర్షణ నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై వారు చర్చించుకున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇరాన్‌తో మధ్యవర్తిత్వానికి అవసరమైతే తాము సాయం చేస్తామని నెతన్యాహుకు పుతిన్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్‌లో శాంతి భద్రతలను తిరిగి నెలకొల్పడానికి కావాల్సిన దౌత్య ప్రయత్నాలు కూడా చేస్తామని హామీ ఇచ్చారు.ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో గత కొన్ని వారాలుగా ఇరాన్‌లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. వీరిని అడ్డుకునే క్రమంలో భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య చెలరేగిన ఘర్షణలు హింసాత్మకంగా మారడంతో వేలాది మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నిరసనల్లో 3వేలకు పైగా ఆందోళనకారులు మరణించి ఉండొచ్చని అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

గ్రీన్‌లాండ్ ఆక్రమణకు అడ్డుపడితే టారిఫ్‌ల మోత

గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడానికి సహకరించని దేశాలపై టారిఫ్‌లు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం హెచ్చరించారు. వైట్ హౌస్‌లో జరిగిన హెల్త్ రౌండ్‌టేబుల్ సందర్భంగా ఈ హెచ్చరిక జారీ చేశారు. దేశ భద్రత కోసం తమకు గ్రీన్‌లాండ్ అవసరమని చెప్పారు. ఈ ఆర్కిటిక్ దీవిలో అత్యధిక ప్రయోజనాలను రష్యా, చైనా తీసుకుంటున్నాయని, అందువల్ల దీనికి రక్షణ తక్కువగా ఉందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను రష్యా ఖండించింది.

రోహిత్ కెప్టెన్సీ కోల్పోవడం వెనక ఆ ఇద్దరి పాత్ర



రోహిత్ శర్మ వన్డే కెప్టెన్సీ కోల్పోవడం వెనక బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ల పాత్ర ఉందని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఆరోపించాడు. రోహిత్ శర్మ నాయకత్వంలో టీమ్ఇండియా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ.. రోహిత్‌ను సెలక్టర్లు కెప్టెన్సీ నుంచి తప్పించారు. ఆ బాధ్యతలను శుభ్‌మన్ గిల్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని అధికారికంగా బీసీసీఐ (BCCI) చీఫ్ సెలక్టర్ హోదాలో అజిత్ అగార్కర్ ప్రకటించాడు. అయితే.. ఈ నిర్ణయం వెనక హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పాత్ర కూడా ఉందని మనోజ్ తివారీ అభిప్రాయపడ్డాడు. 'అగార్కర్ సంచలన నిర్ణయాలు తీసుకోవడానికి సంకోచించడు. అయితే.. అతడి నిర్ణయం వెనక వేరొకరి పాత్ర కూడా ఉండొచ్చు. అగార్కర్ ఒక్కడే ఇంత పెద్ద సాహసం చేయడు. కోచ్ సూచనల ప్రకారమే చీఫ్ సెలక్టర్‌గా ఈ నిర్ణయం తీసుకుని ఉంటాడు. దీనికి ఇద్దరూ బాధ్యులే' అని మనోజ్ తివారీ ఓ క్రీడా ఛానల్‌తో అన్నాడు. టీ20 ప్రపంచకప్ ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకున్న కెప్టెన్‌ను తొలగించి, అతడి స్థానంలో కొత్త వ్యక్తిని సారథిగా నియమించడం సమంజసం కాదన్నాడు. అది రోహిత్‌ను అవమానించినట్లే అవుతుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. 'రోహిత్ శర్మ.. వన్డే వరల్డ్ కప్ 2027 ఆడటంపై వారికి సందేహాలు ఎందుకున్నాయో నాకు అర్థం కావడం లేదు. అతడి సామర్థ్యాన్ని అనుమానించడం పొరపాటు. రోహిత్ ఎవరికీ సాధ్యం కాని విధంగా వన్డే ఫార్మాట్లో మూడు డబుల్ సెంచరీలు బాదిన విషయాన్ని మరిచిపోకూడదు' అని అన్నాడు.అలాగే ప్రస్తుతం భారత తుది జట్టు ఎంపికలో లోపాలున్నాయని మనోజ్ తివారీ ఆరోపించాడు. 'ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంచుకోవడంలో చాలా అసమానతలున్నాయి. నేను వన్డే మ్యాచ్‌లపై ఆసక్తి కోల్పోయాను' అని పేర్కొన్నాడు.

ఆర్సీబీ ఖాతాలో మూడో విజయం..!

మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(RCB) హ్యాట్రిక్ కొట్టింది. ఉత్కంఠ పోరులో శ్రేయాంక పాటిల్(523) తిప్పేయగా గుజరాత్ జెయింట్స్‌పై భారీ విజయం సాధించింది. హిట్టర్లతో నిండిన గుజరాత్‌ను 150కే ఆలౌట్ చేసింది ఆర్సీబీ. రాధా యాదవ్(66), రీచా ఘోష్(44) మెరుపులకు శ్రేయాంక స్పిన్ మ్యాజిక్ తోడవ్వగా.. మూడో విక్టరీతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది ఆర్సీబీ. గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ చేతిలో కంగుతిన్న గుజరాత్ వరుసగా రెండో ఓటమి మూటగట్టుకుంది.మహిళల ప్రీమియర్ లీగ్‌లో మాజీ ఛాంపియన్ ఆర్సీబీ జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలి పోరులో ముంబై ఇండియన్స్‌కు.. ఆపై యూపీ వారియర్స్‌ను చిత్తు చేసిన బెంగళూరు మూడో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌ను మట్టికరిపించింది. పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ మిడిలార్డర్ పట్టుదలతో కోలుకుని గుజరాత్‌కు 182 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం శ్రేయాంక పాటిల్(523) విజృంభణతో ప్రత్యర్థిని 150కే ఆలౌట్ చేసి హ్యాట్రిక్ కొట్టింది. గుజరాత్ బ్యాటర్లలో భారతి ఫుల్‌మాలి 39 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచింది.డబ్ల్యూపీఎల్ 9వ మ్యాచులో ఆర్సీబీ మిడిలార్డర్ గొప్పగా ఆడింది. పవర్ ప్లేలోనే నాలుగు వికెట్లు పడినా రాధా యాదవ్(66), రీచా ఘోష్(44)లు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వకుండా గొప్పగా ఆడారు. టాస్ ఓడిన బెంగళూరుకు శుభారంభం దక్కలేదు. కష్వీ గౌతమ్ చెలరేగడంతో డేంజరస్ ఓపెనర్ గ్రేస్ హ్యారిస్(17), దయలాన్ హేమలత(4) పెవిలియన్ చేరారు. కీలక ఇన్నింగ్స్ ఆడుదామనుకున్న కెప్టెన్ స్మృతి మంధాన(4) సైతం రేణుకా సింగ్ ఓవర్లో రాజేశ్వరికి క్యాచ్ ఇచ్చింది. ఆ షాక్ నుంచి తేరుకునే లోపే.. గౌతమి నాయక్(4)ను సోఫీ డెవినె పెవిలియన్ పంపింది. దాంతో.. 45 పరుగులకే 4 వికెట్లు పడ్డాయి. ఇక ఆర్సీబీ స్వల్ప స్కోర్‌కే పరిమితమవ్వడం ఖాయమనుకున్నారంతా.ప్రధాన బ్యాటర్లు విఫలైమనా జట్టును గట్టెక్కించే బాధ్యత తీసుకున్నారు రాధా యాదవ్(66), రీచా ఘోష్(44). వీరిద్దరూ ఏమాత్రం ఆత్మరక్షణ ధోరణితో ఆడకుండా గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా రాధ బ్యాట్ ఝులిపించి డబ్ల్యూపీఎల్‌లో తొలి అర్ధ శతకం బాదేసింది. రీచా జతగా 66 బంతుల్లోనే ఐదో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పిందీ ఆల్‌రౌండర్. 105 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని జార్జియా వరేహం విడదీసింది. ఆ తర్వాత వచ్చిన నడినే డీక్లెర్క్(26) ఉన్నంత సేపు దంచేసింది. కష్వీ గౌతమ్ వేసిన 19వ ఓవర్లో రెచ్చిపోయిన డీక్లెర్క్ 6, 4, 4, 6 తో 22 రన్స్ రాబట్టింది. అయితే.. డివెన్(331) రెండు వికెట్లు తీసి 4 రన్స్ మాత్రమే ఇవ్వడంతో ఆర్సీబీ 182కే పరిమితమైంది.

టీ20ల్లోకి అయ్యర్..

స్వదేశంలో వచ్చే నెలలో జరగనున్న టీ20 ప్రపంచకప్ సన్నాహక సిరీస్‌కు భారత స్క్వాడ్‌లో కీలక మార్పులు చేశారు సెలెక్టర్లు. తిలక్ వర్మ (Tilak Varma), ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయపడిన నేపథ్యంలో వీరి స్థానాన్ని మరో ఇద్దరితో భర్తీ చేశారు. న్యూజిలాండ్‌తో పొట్టి సిరీస్ కోసం శ్రేయాస్ అయ్యర్, మిస్టరీ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌లను తీసుకున్నారు. దాంతో.. వన్డేలకే పరిమితమైన అయ్యర్ మళ్లీ టీ20ల్లో దంచేసేందుకు సిద్ధమవుతున్నాడుడిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టు ఈసారి ఫేవరెట్‌గా ప్రపంచకప్ బరిలోకి దిగుతోంది. అంతకంటే ముందుగా జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల పొట్టి సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌కు స్టార్ ఆటగాళ్లు తిలక్ వర్మ సర్జరీ కారణంగా, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయంతో దూరమయ్యారు. దాంతో.. ఐపీఎల్‌లో హిట్టైన శ్రేయాస్ అయ్యర్, వికట్ల వీరుడు రవి బిష్ణోయ్‌లను స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. అయితే.. అయ్యర్‌ను తొలి మూడు మ్యాచ్‌లకు మాత్రమే ఎంపిక చేసినట్టు బీసీసీఐ తెలిపింది. ఇక లెగ్ స్పిన్నర్ బిష్ణోయ్ నిరుడు జనవరిలో చివరి టీ20 ఆడాడు. ఈ యువకెరటం 42 మ్యాచుల్లో 61 వికెట్లు పడగొట్టి సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. టీమిండియా అప్డేటెడ్ టీ20 స్క్వాడ్ : సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్(తొలి మూడు టీ20లకు), హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్.

'చికిరి'.. మరో రికార్డు..

పెద్ది' ఫస్ట్ షాట్ అంటూ అంచనాలను పెంచిన రామ్‌చరణ్.. ఆ తర్వాత 'చికిరి' సాంగ్‌తో సెన్సేషన్ క్రియేట్ చేశారు. బుచ్చిబాబు దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. జాన్వీకపూర్ కథానాయిక. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీ వాయిదా పడుతుందంటూ ఇటీవల వార్తలు వినిపించాయి. దీనిపై కథానాయకుడు రామ్‌చరణ్ మరోసారి స్పందించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన మార్చి 27న 'పెద్ది' విడుదల కానున్నట్లు స్పష్టం చేశారు. ఇంతకు ముందెప్పుడూ చేయని సరికొత్త పాత్రల్లో నటిస్తున్నట్లు చెప్పారు. దీంతో మూవీ విడుదల తేదీపై వస్తున్న ఊహాగానాలకు తెరపడింది.ఇండస్ట్రీలో ఉన్న స్నేహితుల్లో ఎవరు డ్రైవింగ్ చేస్తుంటే, మీరు పక్కన కూర్చొని రైడ్‌ను ఆస్వాదిస్తారని చరణ్‌ను అడగ్గా.. ఎన్టీఆర్ పేరు చెప్పారు. ఆయన డ్రైవింగ్ చేస్తుంటే ఆస్వాదించవచ్చని అన్నారు. ఎన్టీఆర్‌ను క్రేజీ, మ్యాడ్ డ్రైవర్ అంటూ కితాబిచ్చారు. తారక్ కారు డ్రైవ్ చేస్తుండగా పక్కన కూర్చొన్న స్నేహితులకు ఎదురైన అనుభవాలను తనతోనూ పంచుకున్నట్లు చెప్పారు. తాను ఏ విషయాన్నీ సీరియస్‌గా తీసుకోనని, ఫెయిల్యూర్, సక్సెస్ ఏదీ కూడా మనసుకు తీసుకోనని ఈ సందర్భంగా చరణ్ తెలిపారు. 'పెద్ది' నుంచి ఫస్ట్ సింగిల్ 'చికిరి' సాంగ్ ప్రస్తుతం ట్రెండ్ సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ ఈ సాంగ్‌కు యూట్యూబ్‌లో 200+ మిలియన్ వ్యూస్ దక్కించుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ పాటపై మూడు లక్షలకు పైగా రీల్స్, 8లక్షలకు పైగా షార్ట్స్ చేశారట. మొత్తంగా 'చికిరి' సాంగ్‌కు 2మిలియన్ లైక్స్ వచ్చాయి. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నాగ్ 100 కోట్లు కొట్టాలంటే..

తెలుగు సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు టాలీవుడ్ కింగ్ నాగార్జున. కెరీర్ స్టార్టింగ్ నుంచే ప్రయోగాత్మక సినిమాలు, విభిన్న పాత్రలతో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. అయితే గత కొన్నేళ్లుగా ఆయన చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. నాగార్జున స్క్రీన్ ప్రెజెన్స్ ను పూర్తిగా యూజ్ చేసుకోకపోవడమే అందుకు ప్రధాన కారణమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే నాగార్జున ప్రస్తుతం తన కెరీర్ లో 100వ సినిమాను చేస్తున్నారు.కింగ్ 100 అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఆ చిత్రానికి తమిళ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఆ మూవీ.. యాక్షన్ ప్రధానంగా సాగుతుందని తెలుస్తోంది. సినిమాలో నాగార్జున లుక్, క్యారెక్టర్ పూర్తిగా కొత్తగా ఉంటుందని సమాచారం. కెరీర్ లో ల్యాండ్ మార్క్ మూవీ కావడంతో ప్రాజెక్ట్ పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.అదే సమయంలో నాగ్ కు రూ.100 కోట్ల హిట్ ఎప్పుడు సొంతమవుతుందోనని అంతా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు కెరీర్ లో ఎన్నో సినిమాల్లో నటించినా.. ఆ మార్క్ అందుకోకపోవడం గమనార్హం. ఆయనతో పాటు సీనియర్ హీరోలు అయిన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ మాత్రం ఇప్పటికే పలు రూ.100 కోట్ల సినిమాలను తమ ఖాతాలో వేసుకున్నారు. దీంతో నాగార్జున అభిమానుల్లో ఈ అంశం మరింత ఆసక్తిగా మారింది. అయితే ఇప్పుడు నాగార్జునకు రూ.100 కోట్ల హిట్ రావాలంటే అనిల్ రావిపూడితో సినిమా చేయాలని అనేక మంది సినీ ప్రియులు, నెటిజన్లు, కొందరు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచాయి. ముఖ్యంగా చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి సీనియర్ హీరోలతో ఆయన చేసిన సినిమాలు పండగల సీజన్ లో భారీ వసూళ్లను సాధించాయి.ఇప్పటివరకు అనిల్ రావిపూడితో పని చేయని సీనియర్ హీరోల్లో నాగార్జున ఒకరే మిగిలారు. అందుకే ఆ కాంబినేషన్ వస్తే నాగ్ కెరీర్ కు ఇది సరైన టర్నింగ్ పాయింట్ అవుతుందని సినీ వర్గాలు అంటున్నాయి. ఫుల్ ఎంటర్టైనర్ అయినా, కొత్తదనం ఉన్న కథ అయినా అనిల్ రావిపూడి హ్యాండిల్ చేయగలరనే నమ్మకం ఇండస్ట్రీలో ఉంది. అంతేకాదు సీరియస్ టోన్ ను కూడా సక్సెస్ ఫుల్ గా చూపించగలరు. ఇప్పటికే భగవంత్ కేసరి మూవీతో అది నిరూపించారు. అదే సమయంలో అనిల్ సినిమాలు తక్కువ బడ్జెట్ లో వేగంగా పూర్తవుతాయి. దీంతో నాగార్జున నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఏదేమైనా.. నాగార్జున, అనిల్ కాంబినేషన్ లో సినిమా వస్తే, అది నాగ్ కు ఫస్ట్ రూ.100 కోట్ల హిట్ గా నిలిచే అవకాశం ఉందని ఆయన అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరేం జరుగుతుందో.. ఆ కాంబోలో ఎప్పుడు మూవీ వస్తుందో వేచి చూడాలి.

ఆరు సంవత్సరాల తర్వాత సంక్రాంతి కలిసొచ్చింది

టాలీవుడ్‌లో 2026 సంక్రాంతి బరిలో పలు ఇంట్రెస్టింగ్ చిత్రాలు రిలీజ్ అయ్యాయి. ఈ సినిమాల్లో హీరో నవీన్ పొలిశెట్టి లీడ్ రోల్‌లో నటించిన 'అనగనగా ఒక రాజు' సినిమా బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మారి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అందాల భామ మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో, చిత్ర బృందం థ్యాంక్స్ మీట్ నిర్వహించింది.ఈ కార్యక్రమంలో నిర్మాత నాగ వంశీ మాట్లాడుతూ.. "ఆరు సంవత్సరాల తర్వాత ఈ సంక్రాంతి నాకు అత్యంత సంతృప్తిని ఇచ్చింది. దీనికి కారణం అనగనగా ఒక రాజు మూవీనే. అల్లు అర్జున్‌తో చేసిన 'అల వైకుంఠపురములో' తర్వాత సంక్రాంతికి ఆ స్థాయి విజయం మాకు రాలేదు. గత సంవత్సరం సాంకేతికంగా అద్భుతమైన సినిమా (డాకు మహారాజ్) తీసినా, డిస్ట్రిబ్యూటర్లకు ఆశించిన స్థాయిలో లాభాలు రాలేదు. కానీ ఈసారి అనగనగా ఒక రాజుతో మేము నిజంగా రాక్ చేశాం" అని అన్నారుతనను ఎల్లప్పుడూ ఆదరిస్తున్న ప్రేక్షకులకు, మీడియాకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్ని నెలల్లో తమ సినిమాలు (కింగ్డమ్, మాస్ జాతర) ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. ఈసారి మాత్రం అగ్ర నిర్మాతలు తమకు మద్దతుగా నిలిచారు. వారి ప్రోత్సాహం తనకు చాలా ఆనందాన్ని ఇచ్చిందని ఆయన చెప్పారు.

తమన్నాను ఇబ్బంది పెట్టిన డైరెక్టర్!

తమన్నా పరిచయం అవసరం లేని పేరు .సౌత్ ఇండస్ట్రీలో మాత్రమే కాకుండా నార్త్ ఇండస్ట్రీలో కూడా సినిమాలలో వెబ్ సిరీస్ లలోను నటిస్తూ కెరియర్ పరంగా ఎంతో బిజీగా ఉన్నారు. తమన్నా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి దాదాపు రెండు దశాబ్దాలు అవుతున్న ఇప్పటికీ ఈమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని చెప్పాలి. కొత్త హీరోయిన్లకు పోటీగా సినిమాలు వెబ్ సిరీస్ లలో నటిస్తున్నారు. అదేవిధంగా స్పెషల్ సాంగ్స్ ద్వారా కూడా పెద్ద ఎత్తున ప్రేక్షకులను ఎంటర్టైన్ చేస్తున్న సంగతి తెలిసిందే. తమన్నా సినిమాలలో స్పెషల్ స్టెప్పులు వేయాలంటే ఒక పాటకు 6 కోట్లు ఇవ్వాల్సిందే. ఈ రేంజ్ లో రెమ్యూనరేషన్ ఇస్తున్నారంటే తమన్నా క్రేజ్ ఏ స్థాయిలో ఉందో స్పష్టం అవుతుంది.ఇక తమన్నా ప్రస్తుతం పలు ప్రాజెక్టుల ద్వారా బిజీగా ఉన్నారు. ఇదిలా ఉండగా తాజాగా తమన్నాకు సంబంధించి ఒక షాకింగ్ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. సినిమా అన్న తర్వాత కథకు అనుగుణంగా కొన్ని సన్నివేశాలలో ఇష్టం లేక నటించాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. ఇలా ఎంతోమంది చాలా అభ్యంతరకరమైన సన్నివేశాలలో అయిష్టంగానే నటిస్తూ ఉంటారు.తమన్నాకు కూడా ఇదే పరిస్థితి ఎదురైందని, ఇటీవల ఈమె ఒక ఇంటర్వ్యూ సందర్భంగా తెలియజేశారు. మరి తమన్నకు ఎదురైన పరిస్థితి ఏంటి అనే విషయానికి వస్తే..తమన్నా ఒక సినిమా షూటింగ్ సమయంలో దర్శకుడు తనని చాలా ఇబ్బంది పెట్టారని తెలియజేశారు. ఒక ఇంటిమేట్ సీన్ చేయడానికి తనకు ఏమాత్రం కంఫర్ట్ గా లేకపోవడంతో డైరెక్టర్ వద్దకు వెళ్లి నేను ఈ సీన్ చేయనని స్పష్టంగా చెప్పారట. ఈమె చేయనని చెప్పినప్పటికీ ఆ డైరెక్టర్ మాత్రం అందరి ముందు" ఫస్ట్ హీరోయిన్ ను మార్చండి" అన్నారట. అ సీన్ విషయంలో డైరెక్టర్ పెద్ద ఎత్తున ఒత్తిడి చేశారని కానీ నేను మాత్రం ఎక్కడ తగ్గలేదని, ఏం జరిగినా ఎదుర్కొంటాను అంటూ నాకు నేనే ధైర్యం చెప్పుకున్నానని తమన్నా తెలియచేశారు.తమన్నా ఒక సినిమా షూటింగ్ సమయంలో దర్శకుడు

తనని చాలా ఇబ్బంది పెట్టారని తెలియజేశారు. ఒక ఇంటిమేట్ సీన్ చేయడానికి తనకు ఏమాత్రం కంఫర్ట్ గా లేకపోవడంతో డైరెక్టర్ వద్దకు వెళ్లి నేను ఈ సీన్ చేయనని స్పష్టంగా చెప్పారట. ఈమె చేయనని చెప్పినప్పటికీ ఆ డైరెక్టర్ మాత్రం అందరి ముందు" ఫస్ట్ హీరోయిన్ ను మార్చండి" అన్నారట. అ సీన్ విషయంలో డైరెక్టర్ పెద్ద ఎత్తున ఒత్తిడి చేశారని కానీ నేను మాత్రం ఎక్కడ తగ్గలేదని, ఏం జరిగినా ఎదుర్కొంటాను అంటూ నాకు నేనే ధైర్యం చెప్పుకున్నానని తమన్నా తెలియచేశారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200